RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 348 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 జనవరి 2025 బుధవారం పేజీలు : 4

## కుంభమేళాను అడ్డుకుంటాం

న్యూఢిల్లీ : ఖలిస్థానీ ఉగ్రవాది పన్నున్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ప్రయాగరాజ్‌లో ఈ నెల 13నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగే మహాకుంభమేళాను అడ్డుకుంటామంటూ వీడి యో విడుదల చేశాడు. 'మహాకుంభ్ ప్రయాగరాజ్ 2025 యుద్ధ భూమిగా మారుతుంది', 'హిందుత్వ భావజాలాన్ని హత్య చేయం డి,' 'ప్రయాగరాజ్, లఖ్‌నవూ విమానాశ్రయాల్లో ఖలిస్థాన్ జెండా లను ఎగురవేయండి' అంటూ వ్యాఖ్యలు చేశాడు. 'చలో ప్రయోగ రాజ్' అంటూ మద్దతుదార్లకు పిలుపునిచ్చాడు. కుంభమేళాను వ్యతిరేకిస్తూ పన్నున్ హెచ్చరికలు చేయడం పది రోజుల్లో ఇది రెండోసారి. కుంభమేళాలో ముఖ్య రోజులైన సంక్రాంతి(జనవరి 14), మౌని అమావాస్య(జనవరి 29), బసంత పంచమి(ఫిబ్రవరి 3)న ఆటంకాలు కలిగిస్తామని మొదట హెచ్చరించాడు.

## కేటీఆర్, హరీష్ రావు, కవిత అత్యవసర భేటీ !

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్య నాయకులు మాజీ మంత్రి టి.హరీష్ రావు, ఎమ్మెల్సీ కవితలు అత్యవసరంగా భేటీ అయ్యారు. నందినగర్ నివాసంలో భేటీయైన కేటీఆర్, హరీష్ రావు, కవితలు తాజా రాజకీయ పరిస్థితులు, ఫార్ములా ఈ రేసు కేసులో పరిణామాలపై చర్చించారు. ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ కేసును కొట్టివేయాలంటూ, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో వారు లీగల్ టీమ్ తో భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపారు. క్వాష్ పిటిషన్ కొట్టివేయడం..ఈడీ విచారణకు



కేటీఆర్ సమయం కోరడం..ఏసీబీ 9వ తేదీన విచారణకు హాజరుకావాలని ఇచ్చిన నోటీసులపై ఈ సందర్భంగా ముగ్గురు నాయకులు న్యాయవాదుల బృందంతో చర్చించారు. ఫార్ములా ఈ రేసు కేసులో తదుపరి ఏం చేయాలన్న దానిపై వారు కీలక కసరత్తులో మునిగారు. కేసులో కేటీఆర్ అరెస్టును అడ్డుకునేలా సుప్రీంకోర్టు తలుపు తట్టే ప్రతిపాదనపై కూడా యోచిస్తున్నారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు ముగ్గురు కూడా చాల రోజుల తర్వాత అత్యవసరంగా ఒకచోట సమావేశం కావడంతో ఏం జరుతుందోనన్న ఉత్కంఠతో బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో నందినగర్ వద్దకు చేరుకున్నారు.




హైదరాబాద్: ఫార్ములా ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కెవియేట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ కేసులో ఒకవేళ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు గానే ఆశ్రయించింది. ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్?ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. అరెస్ట్ చేయొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులును కూడా హైకోర్టు ఎత్తివేసింది. ఏసీబీ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోలేమని కేటీఆర్ తరపు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించింది. అందరికి 'రూల్ ఆఫ్ లా' వర్తిస్తుందని కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు గుర్తుచేసింది.

**అసలు కేటీఆర్‌పై నమోదైన కేసు ఏంటంటే..** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ కోసం రూ.55 కోట్లు విదేశీ కంపెనీలకు చెల్లించారు. అయితే అప్పట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ నిధులను విదేశీ సంస్థలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు లేఖ రాసింది. ఏసీబీకి

## ఫార్ములా ఈ కార్ రేసు... కేసు కీలక మలుపు!

# కేటీఆర్‌ను వెంటాడుతున్న... రేవంత్ సర్కార్..!!

కూడా మున్సిపల్ శాఖ ఫిర్యాదు చేసింది. ఏసీబీ రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఫార్ములా ఈ రేస్ కోసం జరిగిన బ్యాంక్ లావాదేవీలపై ఏసీబీ ఆరా తీసింది. హెచ్ఎండీఏ నుంచి ట్రాన్స్‌ఫర్ అయిన నిధులు.. ఏ అకౌంట్స్‌లోకి చేరాయనేది కూడా గుర్తించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనే డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తేల్చింది. ఈసీ నుంచి అనుమతులు తీసుకోకుండా నిబంధనలు అతిక్రమించారని తేలింది.

2023 అక్టోబర్ 3, 11వ తేదీల్లో హెచ్ఎండీఏ బోర్డు అకౌంట్ నుంచి రూ.45.71 కోట్లు లండన్‌లోని ఫార్ములా-ఈ ఆపరేషన్స్‌కు తరలించారు. ఇందుకు గాను ఆర్బీఐ రూల్స్ పాటించనందున హెచ్ఎండీఏ రూ.8 కోట్లను ఐటీ శాఖకు పెనాల్టీగా చెల్లించాల్సి వచ్చింది. ఫెడరేషన్ ఆఫ్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఐఏ)కు రూ.1.10 కోట్లు చెల్లించారు. ఇలా మొత్తం రూ.54.89 కోట్లు మున్సిపల్ నిధులను అప్పటి మంత్రి కేటీఆర్ దుర్వియోగం చేశారని ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.



## ఫార్ములా ఈ కార్ రేస్.. ఏపీలో సోదాలు

అమరావతి: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణ హైకోర్టు తీర్పుతో ఏసీబీ అధికారులు ఫార్ములా ఈ రేసు కేసులో దూకుడు పెంచారు. ఫార్ములా-ఈ కేసులో పలుచోట్ల ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి సోదాలు చేపట్టారు. ఈ కేసుతో ఆంధ్రప్రదేశ్‌తోనూ లింక్ ఉందని అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు ఇవాళ(మంగళవారం) ఏపీకి వెళ్లి సోదాలు నిర్వహించారు. పలు కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి కీలక డాంక్యుమెట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మచిలీపట్నంలో ఏస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయంలోకి ఏసీబీ అధికారులు ప్రింటర్లు తీసుకువెళ్లారు. పలు డాక్యుమెంట్లను ఏసీబీ బృందం కాపీలు తీసుకుంటున్నారు. మొత్తం 12 మంది ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ కార్ రేస్‌కు సంబంధించి నిధులు ఏ అకౌంట్ నుంచి వచ్చాయనే అంశంపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు సేకరిస్తున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన ఏసీబీ ఉన్నతాధికారుల బృందం తనిఖీలు చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఏసీబీ బృందం ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. చలమశెట్టి సునీల్‌కు చెందిన గ్రీన్కో అనుబంధ సంస్థ అని తెలంగాణ పోలీసులు చెబుతున్నారు. చలమశెట్టి సునీల్ జన్మస్థలం కృష్ణా జిల్లా మచిలీపట్నం. సునీల్ తల్లి వెంకటలక్ష్మి గతంలో బందర్ మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ నుంచి ఉదయాన్నే ఏసీబీ బృందం అధికారులు వచ్చారు. పై అధికారుల ఆదేశాల మేరకే తాము సోదాలు చేస్తున్నామని తెలంగాణ ఏసీబీ అధికారులు తెలిపారు.

## తప్పు చేయనప్పుడు కేటీఆర్ కోర్టుకెందుకు వెళ్లారు?

కామారెడ్డి: మాజీ మంత్రి కేటీఆర్ ఫార్ములా రేసు కేసుపై మంత్రి జూపల్లి కృష్ణారావు షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిందన్నారు. తప్పు చేయనప్పుడు కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఫార్ములా రేసు కేసును కేటీఆర్ ఫేస్ చేయాలన్నారు. ఏసీబీ విచారణకు కేటీఆర్ సహకరించాలి, హాజరు కావాలని చెప్పారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిందని చెప్పారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అయిందని విమర్శించారు. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం అనేది కలగానే మిగిలిపోతుందని ఆక్షేపించారు.బాన్సువాడలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఇవాళ(మంగళవారం) పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరు



గ్యారంటీలు అమలవుతున్నాయని తెలిపారు. రూ.21 వేల కోట్లు రైతు భరోసా కింద తమ ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని అన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులకు నెలకు రూ.6500 కోట్లు వడ్డీ కట్టాల్సి వస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కేటీఆర్ తమ ప్రభుత్వం గురించి మాట్లాడితే ఆధారాలు ఉండాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం కలిగిందని అన్నారు. పెరిగిన ఆదాయం పేదవాళ్లకు పంచిపెట్టాలనే ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణ రాష్టానికి కాంగ్రెస్ పార్టీ శ్రీరామ రక్ష అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఉద్ఘాటించారు.




## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల.. ఫిబ్రవరి 5న పోలింగ్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఢిల్లీలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఢిల్లీలో ఫిబ్రవరి 5న ఒకే దశలో ఓటింగ్ నిర్వహిస్తామని, ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు ఉంటుందని రాజీవ్ కుమార్ అన్నారు. ఫిబ్రవరి 23తో ఢిల్లీ అసెంబ్లీ పదవీకాలం ముగియనుండడంతో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. బీజేపీ, ఆప్, కాంగ్రెస్ ఇప్పటికే కొన్ని స్థానాల్లో తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించాయి. దేశంలోని పోలింగ్ ప్రక్రియపై ఓటర్లు అవగాహనతో ఉన్నారని రాజీవ్ కుమార్ చెప్పారు. ఈవీఎంలపై సందేహాలు అవసరం లేదని తెలిపారు.

ఓటర్ల జాబితాకు సంబంధించి వస్తున్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. ఈవీఎంలో ఏదైనా లోపాలు ఉన్నట్లు వస్తున్న ప్రచారానికి ఆధారాలు లేవని తెలిపారు. ఈవీఎంలో వైరస్ లేదా బగ్‌ను ప్రవేశపెట్టే అవకాశమే లేదని చెప్పారు. ఈవీఎంలో చెల్లని ఓట్ల ప్రశ్నే లేదని, రిగ్గింగ్ లేదని స్పష్టం చేశారు. తాము ర్యాండమ్‌గా వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కిస్తున్నామని, ఇప్పటివరకు స్లిప్పుల లెక్కింపుల్లో ఎక్కడా తేడా రాలేదని తెలిపారు. ట్యాంపరింగ్ జరుగుతుందనేది నిరాధార ఆరోపణ అని అన్నారు. యూపీలోని మిల్కీ పూర్, తమిళనాడులోని ఇరోడ్ స్థానాలకు కూడా ఉప ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. **ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ :** జనవరి 10న ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ దాఖలుకు చివరి తేదీ జనవరి 17, నామినేషన్ల పరిశీలన జనవరి 18, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ జనవరి 20, ఫిబ్రవరి 5 పోలింగ్.. ఫిబ్రవరి 8 ఓట్ల లెక్కింపు, ఫలితాలు, ఫిబ్రవరి 10 నాటికి ముగియనున్న ఎన్నికల ప్రక్రియ.

# తెలుగు రాష్ట్రాలు... బీ అలర్ట్!




న్యూఢిల్లీ: ఇండియాలో HMPV పాజిటివ్ కేసుల సంఖ్య 7కి చేరింది. తాజాగా.. తమిళనాడులో రెండు పాజిటివ్ కేసులు నమోదు కావడం గమనార్హం. చెన్నైలో ఒక కేసు, సేలంలో ఒక కేసు నమోదు కావడంతో తమిళనాడులో టెన్షన్ నెలకొంది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఎక్కువ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగించే విషయం. తమిళనాడులో నమోదైన రెండు HMPV పాజిటివ్ కేసులకు సంబంధించి ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు మీడియాకు వివరాలు వెల్లడించారు. తమిళనాడులో HMPV సోకిన ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని.. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్నామని తెలిపారు. చైనాలో వ్యాప్తి చెందుతున్న హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు మన దేశంలోనూ నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 7 కేసులు రికార్డయ్యాయి. కర్నాటకలో 2, తమిళనాడులో 2, గుజరాత్ లో ఒక్కటి చొప్పున నమోదయ్యాయి. వైరస్ సోకిన 3 నెలల పాప కోలుకుని ఇప్పటికే డిశ్చార్జ్ కాగా.. మిగతా వాళ్లు ఆస్పత్రుల్లో ట్రీట్ మెంట్ పొందుతున్నారు. చైనాలో వ్యాప్తి చెందుతున్న హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు మన దేశంలోనూ నమోదు కావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికి 7 కేసులు రికార్డయ్యాయి. వైరస్ సోకిన 3 నెలల పాప కోలుకుని ఇప్పటికే డిశ్చార్జ్ కాగా.. మిగతా వాళ్లు ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు. కాగా, హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై ఆందోళన అక్కర్లేదని ఐసీఎంఆర్ తెలిపింది. ఈ వైరస్ పాతదేనని ఇప్పటికే ఇండియాతో సహా ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తిలో ఉందని స్పష్టం చేసింది. దేశంలో ఇన్ ఫ్లూయెంజా, తీవ్ర శ్వాసకోశ వ్యాధుల లాంటి కేసులు అసాధారణ రీతిలో ఏమీలేవని పేర్కొంది. హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిపై నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని చెప్పింది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్ మన దగ్గర ఉందని పేర్కొంది.

# సంపాదకీయం

## పాకిస్థాన్ లో ఏం జరుగుతోంది..?

పొరుగు దేశం పాకిస్థాన్ లో ఏం జరిగినా మనం ఒక లుక్ వేయాల్సిందే.. అసలే సైన్యం నియంత్రణ అధికంగా ఉండే దేశం.. పైకి మాత్రమే ప్రజాస్వామ్యం.. పైగా బలూచిస్థాన్ అనే ప్రాంతం ఎప్పట్నుంచో స్వయం ప్రతిపత్తి కోరుతోంది. దీంతోపాటు తరచూ దాడులు, ఆందోళనలు జరుగుతున్నాయి. ఇప్పుడు మరోసారి కల్లోలం రేగేలా కనిపిస్తోంది. అది కూడా భారీగా సైనికుల మరణం కావడం గమనార్హం. దీనికి పాకిస్థాన్ సైన్యం ఎలా స్పందిస్తుందో.? బలూచిస్థాన్.. పాకిస్థాన్ లో గిరిజన తెగల డామినేషన్ ఉన్న ప్రాంతం. ఇక్కడ తరచూ పాక్ సైన్యం-స్థానిక తెగల మధ్య ఘర్షణలు జరుగుతుంటాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) పేరిట ఓ విభాగమే ఉంది. బీఎల్ఏ తాజాగా పాక్ సైన్యంపై ఊహించని స్థాయిలో దాడికి దిగింది

**నలుగురు కాదు.. 47...** బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడిలో నలుగురు సైనికులే చనిపోయారని పాకిస్థాన్ సైన్యం చెబుతోంది. కానీ, ఆ సంఖ్య 47 అంటోంది బీఎల్ఏ. ఈ మేరకు బలూచిస్థాన్ పోస్ట్ అనే పత్రికలో ప్రకటించింది. వీరేకాక 30 మంది వరకు తీవ్రంగా గాయపడినట్లు పేర్కొంది. కాగా, బీఎల్ఏ దాడి చేసిన వీడియోలు, ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఓ వ్యక్తి ఎక్స్ లో పోస్ట్ చేసిన ప్రకారం.. వెళ్తున్న బస్సులో పేలుడు సంభవించింది. ఈ ఘటన శనివారం తుర్బత్ వద్ద జరిగింది. పాకిస్థాన్ సైనికుల కాన్వాయ్ పై బీఎల్ఏ మాజిద్ బ్రిగేడ్ ఆత్మాహుతి దళం దాడి చేసింది. తుర్బత్ మరో 8 కిలోమీటర్లు ఉందనగా సాయంత్రం 5.45 సమయంలో దాడి జరిగింది.

**అచ్చం పుల్వామాలో లోగానే...** జమ్మూ కశ్మీర్ లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరిలో ఏం జరిగిందో అందరూ చూశారు. భారత సైనికుల కాన్వాయ్ పై పాకిస్థాన్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు దాడికి దిగారు. దీంతో 40 మంది చనిపోయారు. ఈ ఘోరం భారత దేశాన్ని అంతటినీ కదిలించిం ది. ఇప్పుడు బలూచిస్థాన్ లోని తుర్బత్ లోనూ అదే విధంగా దాడి జరిగింది. ఐదు బస్సులు సహా ఏడు సైనిక వాహ నాల కాన్వాయ్ పై దాడి జరిగింది. ఇవి కరాచీ నుంచి తిర్బత్‌లోని ఫ్రాం టియర్ కోర్ ప్రధాన కార్యాలయానికి వెళ్తున్నాయి. బీఎల్ఏ ఇంటెలిజెన్స్ వింగ్ జిరాబ్ సమన్వయంతో ఈ దాడి జరిగింది.

# ఎకరాల్లో చెరపట్టి.. గజాల్లో విక్రయించి



హైదరాబాద్: హైడ్రా కాస్త నెమ్మదించడంతో అక్రమార్కులు చెరువుల ఎఫ్‌టీఎల్‌లోనే భవనాలు నిర్మించి రాత్రికి రాత్రే వాటికి రంగులు వేస్తున్నారు. అధికారులు వచ్చినా అది పాత భవనంలా ఏమార్చడానికి సరికొత్త ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీంతో రంగారెడ్డి జిల్లా పరిధి గండిపేట మండలంతోపాటు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో అనేక చెరువుల్లో భారీ భవంతులు వెలుస్తున్నాయి. కొన్ని చోట్ల చెరువులకు ఆనుకొని విల్లాలు నిర్మించగా మరికొన్ని చోట్ల పెళ్లి మండపాలు నిర్మించారు. కిందిస్థాయి అధికారులు ఇందుకు తోడ్పాటు అందిస్తున్నారు. ఈ కబ్జాలపై హైడ్రా వేగంగా స్పందించకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇవీ ఉదాహరణలు**

కిస్మత్‌పూర్‌లోని ఎర్రగుంట చెరువు పరిస్థితి మరీ దారుణం. 15.06 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు ఇప్పుడు 5 ఎకరాల్లోనే ఉంది. అంటే పది ఎకరాలు ఆక్రమణదారుల చెరలోకి వెళ్లిపోయింది. ఇక్కడ 20 వరకు విల్లాలు కూడా వచ్చాయి. ఒక వాటర్ ట్యాంక్ కూడా చెరువుకు ఆనుకునే నిర్మాణమైనా కూడా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

బండ్లగూడజాగీర్ పరిధిలోని బీజాపూర్ హైవేకు ఆనుకొని ఉన్న సర్వేనంబరు-10లో 34.29 ఎకరాల్లో పీరంచెరువు విస్తరించి ఉంది. అక్రమార్కులు 14.29 ఎకరాలను కబ్జా చేసి, చెరువు గర్భంలోనే లేఅవుట్ నిర్మించి గజాల చొప్పున విక్రయించారు. కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ ఎకరం నికరంగా రూ.50కోట్ల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఇప్పటికే రూ.735కోట్ల విలువైన చెరువు స్థలం కబ్జాకు గురైంది. తాజాగా ఓ అక్రమార్కుడు వెయ్యి గజాలకు పైగా చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాన్ని మట్టితో నింపి చదును చేశారు. ఆ స్థలం తనదన్నట్లుగా బోర్డునూ పాతారు. సుమారు రూ.15 కోట్ల విలువైన స్థలం కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీరంచెరువులో కొందరు స్థిరాస్తి వ్యాపారులు నిర్మాణంలోని ఇళ్లకు సున్నం, రంగులు వేస్తున్నారు. ఒకవేళ అధికారులు కూల్చేందుకు వస్తే సున్నం, రంగును చూసి వెళ్లిపోతారన్న ఎత్తుగడ రచిస్తున్నారని పలువురుతో చెప్పారు. హైదర్షాకోట్‌లో 6.29 ఎకరాల ఎర్రకుంట నాలుగు ఎకరాలకుపైగా కబ్జాదారుల

చేతుల్లోకి వెళ్లడంతో చెరువు ఉనికిని కోల్పోయింది. ఎఫ్‌టీఎల్‌లోనే పది భవనాలను నిర్మించారు. పంచాయతీ అనుమతితో ఇక్కడ ఫంక్షన్‌హాల్ నిర్మాణ జరగడం విశేషం. అధికారులు ఈ వైపు కన్నెత్తి చూడటం లేదు.గంధంగూడలోని కొత్త చెరువు ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చింది. 4.13 ఎకరాల్లో ఉండాల్సిన చెరువు ఇప్పుడు ఒక ఎకరంలోనే ఉంది. మూడు ఎకరాలను తమ కనుసన్నల్లోకి తీసుకుని ఏకంగా లే అవుట్ కూడా వేశారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, తూంకుంటకు చెందిన నరసింహ కుటుంబ సభ్యులు, ఆలయం తరఫున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# 'ముప్పే'ట దాడి!



పెద్దపల్లి : జనాభాతో పాటే పెరుగుతున్న కాలుష్యం మానవాళికి శాపంగా మారింది.. ప్రకృతి ప్రసాదమైన గాలి, నీరు, నేల తదితర సహజ వనరులన్నీ కలుషితమవుతున్నాయి.. ఇప్పటికైనా ప్రమాదం గుర్తించకపోతే మున్ముందు గడ్డు పరిస్థితులే.. ఇంధనాల వినియోగం తగ్గించడం, పచ్చదనం పెంచడం, ప్రత్యామ్నాయ మార్గాలు అవలంబించడమే అందరి లక్ష్యం కావాలి..

**జల గరళం**

సమస్య: జల కాలుష్యం అధిక వ్యాధులకు కారణమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన గోదావరి నది, మానేరు తదితర వాగుల నీరు కలుషితమవుతోంది. ధర్మపురి, గోదావరిఖని, మంథని ప్రాంతాల్లో గోదావరిలో మురుగు కలుస్తుండగా, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ తదితర పరిశ్రమల నుంచి వ్యర్థాలను నేరుగా జల వనరుల్లోకే వదులుతున్నారు. మరోవైపు వ్యవసాయంలో విచ్చలవిడిగా ఎరువుల వాడకంతో నీటితో పాటు పంట ఉత్పత్తులు కలుషితమవుతున్నాయి. భూసారం దెబ్బతింటోంది.

**ప్రభావం**

నీటి కాలుష్యంతో శరీరంపై దురద, దద్దుర్లు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. పరిశ్రమల పరిసరాల్లో బోర్ల నుంచి కలుషిత జలం వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నీటిలో నైట్రేట్ శాతం పెరగడంతో భూసారంపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రమాదకర ఫ్లోరైడ్ లక్షణాలు లేకున్నా ఫ్లోరైడ్ శాతం కొద్దిగా పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**పరిష్కారం**

పారిశ్రామిక వ్యర్థాలను గోదావరిలో కలవకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి. వ్యర్థాలను శుద్ధి చేయడానికి ఎస్టీపీ(సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు)లు నిర్మించుకోవాలి. ఉమ్మడి జిల్లాలో 12.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నా, అందులో 2 శాతం కూడా సేంద్రియ విధానంలో సాగు చేయడం లేదు. ఈ దిశగా ప్రభుత్వం రైతుల్లో చైతన్యం కల్పించాలి.

**ప్లాస్టిక్ భూతం**

సమస్య: తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లతో పర్యావరణానికి పెను విఘాతంగా మారింది. కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలతో పాటు 14 పురపాలికల్లో రోజుకు 300 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతుండగా అందులో సింహ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి.

**ప్రభావం**

ప్లాస్టిక్ వ్యర్థాలు వనరులను ముంచెత్తుతున్నాయి. క్యాన్సర్, రక్తహీనత, క్షయ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మూగజీవాల కడుపుల నుంచి వందలాది పాలిథీన్ కవర్లు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. భూసారం తగ్గుతోంది.

**పరిష్కారం**

ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా చైతన్యం కల్పించాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జ్యూట్ సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలి. క్యారీ బ్యాగుల తయారీని ప్రభుత్వం నియంత్రించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను ఉక్కు, ఇతర పరిశ్రమల్లో ఇంధనంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.

**ప్రాణాలు తీస్తున్న వాయువు**

సమస్య: పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ.. గ్రానైట్ క్వారీలు, రైస్ మిల్లుల నుంచి వెలువడే దుమ్ము, ధూళి వాయు కాలుష్యానికి ప్రధాన కారకాలు. ఉమ్మడి జిల్లాలో 1,378 చిన్నతరహా, 54 మధ్యతరహా పరిశ్రమలున్నాయి. నాలుగు జిల్లాల్లో నిత్యం 10.30 లక్షల వాహనాలు నిత్యం రోడ్డెక్కుతున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గ్రానైట్ పరిశ్రమల వెలువడుతున్న దుమ్ముతో ఊపిరాడటం లేదు.

**ప్రభావం**

ఊపిరితిత్తుల సంబంధిత ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నైట్రోజన్ డయాక్సైడ్ కారణంగా కళ్లు, ముక్కు మండుతున్నాయి. అమ్మోనియా మోతాదు పెరిగితే కళ్ల మంట, శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. వాహనాల పొగ శ్వాసకోశ వ్యవస్థను దెబ్బతీస్తోంది.

**పరిష్కారం**

తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక ప్రాంతాల్లో పచ్చదనం పెంచాలి. సౌర విద్యుత్తును, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

**ముప్పై ఏళ్లుగా సైకిల్‌నే వాడుతున్నా**

నా వంతుగా వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ద్విచక్రవాహనాన్ని వాడొద్దని నిర్ణయించా. ముప్పై ఏళ్లుగా ఎటు వెళ్లాలన్నా సైకిల్‌నే వాడుతున్నా. మూడేళ్లు రామగుండంలో విధులు నిర్వర్తించినా పెద్దపల్లి నుంచి సైకిల్‌పైనే వెళ్లా. వ్యాయామంతో ఆరోగ్యానికి బాగుంటుంది. బి.నర్సింగం, రైల్వే విశ్రాంత ఉద్యోగి, పెద్దపల్లి

**సౌర విద్యుత్తుతో బిల్లు భారం తగ్గింది**

నేను నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలకు నెలకు రూ.7 వేల విద్యుత్తు బిల్లు చెల్లించేవాళ్లం. అయిదేళ్ల కిందట భవనంపై 5 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర పలకలు ఏర్పాటు చేశా. సొంత అవసరాలకు పోను నాలుగైదు నెలలకోసారి ట్రాన్స్‌కో నుంచి రూ.3 వేల ఆదాయం వస్తోంది. వినయ్‌కుమార్, కమాన్‌పూర్

**సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు**

పది ఎకరాల్లో మామిడి, రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. పన్నెండేళ్లుగా సేంద్రియ పద్ధతిలో పంటలు వేస్తున్నా. ఆవు మూత్రం, వేప, వివిధ మొక్కల ఆకులు, పేడ, ఇతర పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని వినియోగిస్తున్నా. భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తున్నాయి. మిట్టపెల్లి రాములు, తుంగూర్, బీర్‌పూర్ మండలం

**ఆదర్శం సుల్తాన్‌పూర్**

ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ పంచాయతీ ప్లాస్టిక్ నిషేధంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ 1,100 జనాభా ఉండగా 2019లో అప్పటి సర్పంచి వెంకటేశ్వర్‌రావు ప్రత్యేక చొరవ చూపారు. ఇంటింటికీ నానో ఓవన్ సంచుల పంపిణీతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. మొక్కల పెంపకంతో ఊరంతా పచ్చదనం నిండింది.

# నిఘా నేల చూపులు

సిరిసిల్ల : నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) నిర్వహణ కరవై అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. మరమ్మతులు కరవై రూ.లక్షల విలువైన పరికరాలు వృథాగా మారాయి. కోతులు తీగలను తరచూ తెంపుతున్నాయి. దీంతో నిర్వహణ భారంగా మారడంతో వాటిని అలాగే వదిలేస్తున్నారు. జిల్లాలో 13 మండలాల పరిధిలోని ప్రజల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నేరాల నియంత్రణతోపాటు కేసుల ఛేదనలో నిఘా నేత్రాలు కీలక పాత్ర పోషిస్తాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన కెమెరాలు నిర్వహణ లేక మరమ్మతులకు గురవుతున్నాయి. నేలవైపు చూస్తున్న కెమెరాల ఫలితంగా పలు నేరాల్లో నిందితుల కదలికలను గుర్తించడం ఇబ్బందిగా మారుతుంది. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, వీధుల్లో నిర్లక్ష్యంగా వదిలేయడంతో భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు త్వరగా గుర్తించలేకపోతున్నారు. కేసుల దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారుతుంది. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కెమెరాలు నిర్వహణ లేక మూలన పడుతున్నాయి. పెద్ద సంఖ్యలో మరమ్మతులకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.

**బస్సుల్లో...**జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో మహిళల భద్రతకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆకతాయిల చేష్టలను గుర్తించి ఆధారాలు సేకరించి చట్టపరమైన చర్యలకు ఉపయోగపడతాయని పెట్టారు. అలాగే అనుమానిత వ్యక్తులు, నిందితులను గుర్తించవచ్చు. కానీ చాలా బస్సుల్లో ఇవి పని చేయడం లేదు.వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు కంచర్ల, రంగంపేట, గర్జనపల్లిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో ఇటీవల పోలీసులు మరమ్మతులు చేపట్టారు. సుభాష్‌నగర్ ప్రధాన కూడలి వద్ద, మిగతా గ్రామాల్లో సాంకేతిక కారణాల వల్ల పని చేయడం లేదు.

**నిర్వహణ లోపంతో...**

మండలంలో వ్యాపారులు, దాతల సహకారంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పోలీసులు 140 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిలో 80 పని చేస్తుండగా, మిగిలిన 60 పని చేయడం లేదు. వాటిని మరమ్మతులను పట్టించుకునే నాథుడు కరవయ్యాడు.ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి ప్రధాన బస్టాండు ప్రాంతమిది. వ్యాపార, వాణిజ్య కేంద్రమైన ఈ గ్రామంలో 4,500 మంది జనాభా ఉన్నారు. రోజూ రూ.కోట్లలో వ్యాపారం సాగుతుంటుంది. అయితే పోలీసులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం, దాతలు, ఇతర వ్యాపారుల భాగస్వామ్యంతో బస్టాండు ప్రాంతంతోపాటు ప్రధాన వీధుల్లో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏడాదిన్నర కిందట వీటిలో ఒకటి ధ్వంసమవగా, మిగతా 14 పని చేయక వృథాగా ఉన్నాయి. అయినా అటు పోలీసులు, ఇటు దాతలు పట్టించుకోలేదు.

మండలంలో ఇరవై మూడు గ్రామాలు ఉండగా 130 సీసీ కెమెరాలు ఉన్నాయి. బోయినపల్లి, కొదురుపాక గ్రామాల్లో పని చేయకపోవడంతో ఇటీవల మరమ్మతు చేయించారు. నర్సింగాపూర్ తదితర గ్రామాల్లో 20 కెమెరాలు పని చేయకపోవడాన్ని గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నారు. మండలంలోని లింగన్నపేటలో 28 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా ఒక్కటీ పని చేయటం లేదు. నర్మాలలో 8 పని చేయటం లేదు. సముద్రలింగాపూర్‌లో పూర్తిగా మూలకు చేరాయి. మిగతా గ్రామాల్లో సగం మాత్రమే పని చేస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. నిందితులను పట్టుకోవడంలో నిఘా నేత్రాలు కీలకంగా పని చేస్తాయి. ప్రగతినగర్, బతుకమ్మ ఘాట్ సమీపం తదితర ప్రాంతాల్లో పని చేయడం లేదు.

మండలంలో నిమ్మపల్లి, కోనరావుపేట, వట్టిమల్ల, మరిమడ్ల గ్రామాల్లో పలు దొంగతనాలు జరిగాయి. సీసీ కెమెరాలు పని చేయక నేటికీ ఆధారాలు లభించలేదు. ధర్మారం, మంగళ్లపల్లి, మల్కపేట, కొలనూర్, మర్తన్‌పేట గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేశారు.

అలంకారప్రాయంగా...ముస్తాబాద్: మండలంలో 22 గ్రామాలు ఉండగా 200 పైగా సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటి తీగలను కోతులు తరచూ తెంపుతున్నాయి. దీంతో అవి పని చేయడం లేదు.

బాగానే పని చేస్తున్నాయిజిల్లాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. కొన్ని మినహా మిగతావి బాగానే పని చేస్తున్నాయి. చెడిపోయిన వాటికి మరమ్మతులు చేయిస్తున్నాం.అఖిల్ మహాజన్, ఎస్పీ

# దరఖాస్తులకు మోక్షం..!

నల్గొండ : ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. జిల్లా కలెక్టర్ స్థాయిలో ఇన్నాళ్లు ఉన్న అధికారాలను విభజించి పలు సమస్యలకు సంబంధించి పరిష్కార బాధ్యతలను అదనపు కలెక్టర్(రెవెన్యూ), రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో)లకు అప్పగించింది. కలెక్టర్ వద్దే ధరణికి చెందిన అన్ని అధికారాలు ఉండిపోవడంతోనే సమస్యలు పేరుకుపోతున్నట్లు ధరణి కమిటీ గుర్తించింది. దీంతో ప్రభుత్వం పలు సమస్యలను విభజించి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**అదనపు కలెక్టర్ పరిష్కరించేవి**

జిల్లా కలెక్టర్‌తో సంబంధం లేకుండా ఇకపై అదనపు కలెక్టర్ వద్ద అయిదు రకాల సమస్యలు పరిష్కారం కానున్నాయి. నాలుగు మాడ్యూళ్ల ద్వారా వచ్చే దరఖాస్తులను తహసీల్దార్, ఆర్డీవోకు పంపించనున్నారు. వారు ఆయా సమస్యలను పరిశీలించి అదనపు కలెక్టర్‌కు పంపిస్తారు. వారు చేసిన సిఫార్సులను పరిశీలించిన పిమ్మట ఆ సమస్యను పరిష్కరిచడం లేదా తిరస్కరించడం చేస్తారు. తిరిస్కరిస్తే దరఖాస్తుదారుడికి స్పష్టమైన సమాధానం ఇవ్వనున్నారు.

యాజమాన్య హక్కు బదిలీ దరఖాస్తులు(టీఎం3-మ్యుటేషన్)

కోర్టు కేసులతో ముడిపడి ఉండే భూములకు పట్టా పాసుపుస్తకాలకు వచ్చేవి(టీఎం24)పట్టా పాసుపుస్తకం లేదా వ్యసాయేతర భూమిగా మార్చడానికి ఆటంకంగా రికార్డుల్లో గృహం, హౌజ్ సైట్ అని నమోదైన వాటికి సంబంధించినవి (టీఎం31)

పాసుపుస్తకం సమాచారంలో తప్పుల సవరణ(టీఎం33)

పేరు మార్పిడి కోసం వచ్చిన దరఖాస్తులు(టీఎం33)

ఆర్డీవో పరిష్కరించేవి..

కు డిజిటల్ సంతకాలకు వచ్చినవి(టీఎం33, జీఎల్ఎం)

వారసత్వ బదిలీ దరఖాస్తులు(టీఎం4)ఎసైన్డ్ భూములకు(పాసుపుస్తకం లేనివి) సంబంధించినవి(టీఎం27)వ్యసాయేతర భూముల మార్పిడికి సబంధించి(టీఎం27) సర్వే నంబర్ల

# వైద్యుల కొరత.. రోగుల వెత

సుల్తాన్‌బజార్ : కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు) ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆసుపత్రికి రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి చికిత్సకు వస్తుంటారు. బధిర చిన్నారులకు ఇక్కడ ఖరీదైన కాక్లియార్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, తల్లిదండ్రులకు అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. దవాఖానాలో రోగుల రద్దీకి అనుగుణంగా ఆరు యూనిట్ల(వైద్యుల బృందం) ద్వారా నిత్యం వైద్య సేవలు అందిస్తున్నారు. రోగుల తాకిడి మేరకు వైద్యులు, నర్సింగ్, ఫార్మసీ, ల్యాబ్ టెక్నీషియన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరు చేసిన పోస్టుల్లో కూడా పూర్తి స్థాయిలో నియమించకపోవడంతో వారితోనే నెట్టుకొస్తున్నారు.

**సాధారణ బదిలీల నేపథ్యంలో..**

ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల ప్రక్రియలో ఇక్కడ పని చేస్తున్న ఆరుగురు ప్రొఫెసర్లలో నలుగురిని బదిలీ చేసింది. ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లలో ముగ్గురు వెళ్లి పోయారు. సుమారు 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు 20 మంది వరకు నర్సింగ్ సిబ్బంది బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో కొత్తవారు రాకపోవడంతో ఓపీ, ఫార్మసీ, ఆడియో విభాగాలతో పాటు వివిధ రకాల పరీక్షలు నిర్వహించే కేంద్రాల వద్ద రోగులు బారులు తీరుతున్నారు.




నిత్యం ఓపీ సుమారు 2000
పడకలు 200
ప్రొఫెసర్లు ఇద్దరు
అసోసియేట్ ప్రొఫెసర్లు ఇద్దరు
అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముగ్గురు
ఫార్మసిస్టు ఒకరు
నర్సింగ్ సిబ్బంది 30

కొరత ఉన్నా.. మెరుగైన సేవలందిస్తున్నాం
డా.ఆనందాచార్య, సూపరింటెండెంట్, ఈఎన్‌టీ ఆసుపత్రి

ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నా.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. చిన్న చిన్న సమస్యలతో బాధపడుతున్న వారు స్థానిక ఆసుపత్రుల్లో చూపించుకోవాలి. అక్కడి వైద్యులు సిఫార్సు చేస్తే ఇక్కడికి రావాలి. అప్పుడు దవాఖానాపై కొంత భారం తగ్గే అవకాశం ఉంది. నిధులకు ఎదురుచూపులు

గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇళ్లలో సుమారు 36,538 అసంపూర్తిగా ఉన్నాయి. నిధుల కోసం గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కొన్ని ఇళ్లు స్లాబుల స్థాయిలో మరికొన్ని గోడల వరకూ వచ్చి నిలిచిపోగా.. మరికొన్నింటికి చిన్నచిన్న సౌకర్యాలు కల్పించాల్సి ఉందని అధికారులు గుర్తించారు. పెద్ద ఎత్తున చేపట్టాల్సిన గోడలు, ఫ్లోరింగ్ తదితర పనులకు సుమారు రూ.1,570 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. కేంద్రం నుంచి రూ.570 కోట్లు: నిర్మాణం పూర్తి చేసేందుకు అయ్యే వ్యయంలో రూ.570 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇళ్ల కేటాయింపు కోసం ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేసిన తరవాత మిగతా నిధులు విడుదల చేస్తామని కేంద్రం స్పష్టం చేయటంతో అధికారులు ప్రస్తుతం ఆ పనులు చేపట్టారు. కేంద్రం వాటాతో పాటు మరో రూ.600 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే దాదాపు 16 వేల ఇళ్లు పూర్తవుతాయని అధికారుల లెక్క. మూసీ పునరుజ్జీవన పథకంలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని 15వేల మందికి అసంపూర్ణంగా ఉన్న ఇళ్ల పనులు పూర్తి చేసి కేటాయించాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టం చేసింది. ఆయా పనులకు మరో రూ.400 కోట్ల వరకు అవసరమని అంచనా వేశారు.

## 5 ఏళ్లలో 10 వేల ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు

హైదరాబాద్: రాష్ట్రంలో పెరగనున్న విద్యుత్ వాహనాల అవసరాలకు తగినట్లుగా ఛార్జింగ్ సదుపాయాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. 2030 నాటికి పది వేల ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 2.5 లక్షల విద్యుత్ వాహనాలున్నాయి. 2026 డిసెంబరు వరకు రోడ్ ట్యాక్స్, వాహన రిజిస్ట్రేషన్ ఛార్జీలను వంద శాతం మినహాయిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కొనే వారి సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా. ఈ క్రమంలో ఛార్జింగ్ కేంద్రాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రాథమిక అధ్యయనం చేయించింది. ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటుకు అనుమతులు ఇచ్చే విషయం పరిశీలించాలని అధికారులకు స్పష్టం చేసింది.

పది లక్షలకు పైగా.. : అయిదేళ్లలో రాష్ట్రంలో ఈవీల సంఖ్య పది లక్షలను అధిగమిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పెరుగుదల 50 నుంచి 60 శాతం హైదరాబాద్ పరిసర జిల్లాల్లో ఉంటుందని అంచనా. వాహనాల పెరుగుదల క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రణాళికను తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో 600 కేంద్రాల ఏర్పాటుకు గతంలో తయారు చేసిన ప్రణాళికను కార్యరూపంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది.

## ప్లమ్ కేకుల్లో రమ్

హైదరాబాద్: కేకులంటే ఇష్టం ఉండని వారు ఎవరుంటారు. మంచి సందర్భం ఏదైనా కేక్ కట్ చేయాల్సిందే. మరి వీటిని కొందరు బేకరీల నిర్వాహకులు ఎలా తయారు చేస్తున్నారో తెలిస్తే అమ్మో అనాల్సిందే. చిన్నారులు ఎంతో ఇష్టంగా తినే ప్లమ్ కేకుల తయారీ ఇష్టారాజ్యంగా జరుగుతోంది. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేయగా.. రెండు ప్రముఖ బేకరీల డొల్లతనం బయటపడింది. సికింద్రాబాద్ కార్ఖానాలోని వాక్స్ పాట్రీస్ బేకరీ, మచ్చబొల్లారంలోని మొంగినీస్ బేకరీలు అపరిశుభ్ర పాత్రల్లో కేకులను తయారు చేస్తుండటం, నిల్వ గదుల్లో బొద్దింకలు, ఎలుకల సంచారం ఉన్నట్టు వెల్లడైంది. వాక్స్ బేకరీ నిర్వాహకులు మరో అడుగు ముందుకేసి.. ఎక్సైజ్‌శాఖ అనుమతి లేకుండా రమ్‌ను కేకుల్లో వినియోగించడం, ఈ విషయాన్ని ప్యాకేజీలపై ముద్రించకపోవడాన్ని ఆహార భద్రతాధికారులు తీవ్రంగా పరిగణించారు. యజమానులను హెచ్చరించి, నోటీసులిచ్చామని టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రకటించారు. తయారీ, గడువు తేదీలు ముద్రించకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

# పచ్చని ఉద్యానవనం.. నిర్వహణకు నీరేదీ?



కరీంనగర్ : నగర నడిబొడ్డున ఉన్న మల్టీపర్పస్ పార్కు త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. పనులు తుది దశలో ఉండగా, ఈనెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతోపాటు మ్యూజిక్‌తో వాటర్ ఫౌంటెయిన్, ఫుడ్ కోర్టు, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్‌ట్రాక్, పచ్చదనం వంటివి ఇందులో ఉన్నాయి. మరో వైపు దాని నిర్వహణకు అధికారులు టెండర్ కూడా పిలిచారు. రూ.20 లక్షలతో రెండేళ్ల కాలపరిమితితో పార్కు నిర్వహణ, మేనేజ్‌మెంట్, ఆపరేషన్‌తో లీజుకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నారు.

**ఇరుగ్గా పార్కింగ్..**

పార్కింగ్‌కు ఇబ్బందులు వచ్చేలా ఉంది. పది కార్లు పెట్టేంత స్థలం మాత్రమే ఉంది. బయట ద్విచక్రవాహనాలు పెట్టాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ లెక్కన పరిశీలిస్తే లీజుకు తీసుకున్న వారు బల్దియాకు మెలికలు పెట్టి గోల్‌మాల్ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ముందుగానే పార్కులో గల సౌకర్యాలు వివరించి పచ్చదనం, ఫౌంటెయిన్ నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాల్సిన అవసరముంది.


**లీజు కోసం పోటాపోటీ**

టెండర్లలో పాల్గొనేందుకు ఈనెల 7న చివరి తేదీ కావడంతో ఇప్పటికే కొందరు జ్యోతిబా ఫులే పార్కు, మల్టీపర్పస్‌ను లీజు తీసుకోవడానికి డీడీలు కడుతున్నట్లు సమాచారం. పాలకవర్గ సభ్యులకు సంబంధం ఉన్న వారితోపాటు కొందరు గుత్తేదారులు ముందుకొస్తున్నారు. గతంలో డివైడర్ల నిర్వహణ సమయంలో ఇలాగే చెట్లకు నీటిని పట్టేందుకు, చెట్ల సంరక్షణకు కార్మికుల నియామకం సందర్భంలో అక్రమాలకు తెరలేపారు. బల్దియా ట్యాంకర్లు వినియోగించుకోవడం, పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించడం విమర్శలకు తావిచ్చింది. ఇలాంటి పరిస్థితి రాకుండా ముందుగానే కఠిన నిబంధనలు అమలు చేస్తే పార్కు 'నిర్వహణ' పకడ్బందీగా ఉండనుంది.

**ఇప్పుడే ట్యాంకర్లతో సరఫరా**

అన్ని హంగులతో తీర్చిదిద్దిన పార్కులో నీటి వసతి కరవైంది. రెండు బోర్‌వెల్స్ వేయగా అందుల్లోంచి నీరు రావడం లేదు. ప్రస్తుతం పనులు చేస్తున్న గుత్తేదారే రోజు ట్యాంకర్లతో నీటిని తీసుకొస్తున్నారు. మ్యూజికల్ ఫౌంటెయిన్, చేపల ఫౌంటెయిన్, గ్రీనరీ, చెట్లకు సరిపడా నీరు కావాలంటే రోజుకు 15 ట్యాంకర్లు అవసరమంటున్నారు. ఎండాకాలంలో అయితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. క్యాంటీన్, సులభ్‌కాంప్లెక్స్ వాటికి కచ్చితంగా నీరు అవసరమవుతుంది. కుళాయి ఉన్నా 24 గంటలు వచ్చే పరిస్థితి ఉండదు. బోర్‌వెల్ ఉన్నట్లైతే వాడుకున్నంత నీరు ఉండి మొక్కలకు ఎలాంటి సమస్య రాదు. పరిశీలిస్తాంఇప్పటివరకు పార్కులో ఉన్న బోర్‌వెల్స్ ఇబ్బందులు మా దృష్టికి రాలేదు. వాటిని పరిశీలించి మరమ్మతులు చేసేలా ఆదేశాలిస్తాం. లేదంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.
రాజ్‌కుమార్, ఎస్ఈ, కరీంనగర్ నగరపాలిక

# పరీక్షా సమయం.. ప్రణాళిక అవసరం



కరీంనగర్ : పరీక్షల సమయం సమీపిస్తోంది.. ఇప్పటికే ఉత్తమ మార్కుల కోసం ఉమ్మడి జిల్లాలోని పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు సిద్ధమవుతున్నారు.. పునశ్చరణ, సన్నద్ధత పరీక్షలు కొనసాగుతున్నాయి. మార్చిలోనే ఎస్సెస్సీ, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఉండటంతో విద్యార్థుల్లో కొంత ఆందోళన, ఇంకొంత భయం నెలకొంది. పదో తరగతి పరీక్షలకు నేటికి సరిగ్గా 75 రోజులు, ఇంటర్ పరీక్షలకు 59 రోజులు, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 29 రోజులే ఉన్నాయి. సమయం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుతూ.. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు.

**అధ్యాపకుల సూచనలు..**

ఎప్పటి పాఠాలు అప్పుడే చదివే విద్యార్థుల్లో పరీక్షలపై అంతగా ఆందోళన ఉండదు. విద్యా సంవత్సరం పొడవునా సరదాగా గడిపి పరీక్షల సమయంలో ఇన్ని సబ్జెక్టులు చదవగలమా అనే ఆందోళన పడే విద్యార్థులుంటారు. అందుకే ఎవరికైనా సమయపాలన, ప్రణాళిక అవసరం.

ఇప్పటి నుంచే పాఠ్యాంశాల సిలబస్‌లోని ముఖ్య అంశాలు, ప్రశ్నల సరళి, ప్రశ్నపత్రాల బ్లూప్రింట్‌పై అవగాహన, మార్కుల కేటాయింపుపై అవగాహన పెంచుకోవాలి.

పరీక్షలకు ముందే అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా చదవడానికి రోజువారీగా సమయపాలన ప్రణాళిక నిర్ధారించుకోవాలి.

గత ప్రశ్నపత్రాలను సాధన చేయడానికి ప్రత్యేక ప్రణాళిక వేసుకోవాలి. రోజులో ఎన్ని సబ్జెక్టులు చదవాలి, వారంలో ఎన్నింటిని పూర్తి చేయాలనే ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి.

సులభంగా ఉన్న వాటిని, కష్టంగా ఉన్న పాఠ్యాంశాలను ఎన్ని రోజులు, ఎంత సమయం, ఎన్ని గంటలు చదవాలనే దానిపై నిర్దిష్ట ప్రణాళిక అవసరం.

దైనందిన అవసరాల సమయాన్ని కుదించి ఏకాగ్రతతో ఏ సమయంలో చదవగలమో అనే దాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా సమయసారిణిని నిర్ధారించుకుని ప్రణాళికతో చదవాలి.

పరీక్షలకు ముందు భయందోళనను వీడేందుకు ప్రాక్టీస్ పేపర్లను సాధన చేయాలి.

నిత్యం పాఠ్యాంశాలను చదివేందుకు, పునశ్చరణకు సమయాలను వేర్వేరుగా నిర్ధారించుకోవాలి. సందేహాలను అధ్యాపకులు, ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి.

ఏకధాటిగా చదవకుండా ప్రతి గంటకు 5-10 నిమిషాలు విరామం తీసుకోవాలి.

**వీటికి విరామమిద్దాం..**

చరవాణుల వినియోగాన్ని తగ్గించాలి. భావోద్వేగాలను కలిగించే సామాజిక మాధ్యమాలకు పూర్తిగా దూరమవ్వాలి.
టీవీ, సినిమాలు పరీక్షల వరకు పక్కన పెట్టేయాలి.
విందులు, వేడుకలకు దూరంగా ఉండటం మంచిది.

**ఇవీ ముఖ్యమే..**

పరీక్షలకు సన్నద్ధ సమయంలో విద్యార్థులకు సమతుల ఆహారం అవసరం. ప్రొటీన్స్, విటమిన్లు, మినరల్స్ ఉండే ఆహారం తీసుకోవాలి. తగినంత నీరు తాగుతుండాలి. ఆహారంలో పండ్లు భాగం చేసుకోవాలి. పరీక్షలు పూర్తయ్యే వరకు మాంసాహారం, కొవ్వు పదార్థాలు, మసాలాలు, జంక్ ఫుడ్, బయటి ఫుడ్‌కు దూరంగా ఉండటం మేలు.
నిత్యం కనీసం 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం.
రోజూ కొంతసేపు చిన్న చిన్న వ్యాయామాలు చేస్తే ఒత్తిడి దూరమవుతుంది.
నిత్యం ఉదయం, సాయంత్రం కాసేపు ధ్యానం, ప్రాణాయామం సాధన చేస్తే ఆక్సిజన్ సరఫరా మెరుగవుతుంది.
కొంత సేపు నడక ద్వారా రక్తప్రసరణ పెరిగి మెదడు చురుకుగా వ్యవహరిస్తుంది.
ఒకే చోట కూర్చుని గంటల తరబడి చదవకుండా మధ్య మధ్యలో ఆరుబయట కాసేపు తిరగాలి.
చదువుకున్న అంశాలు స్నేహితులతో చర్చించాలి. అప్పుడు ఆ అంశాలు బాగా గుర్తుండిపోతాయి.

కరీంనగర్
పదో తరగతి విద్యార్థులు 12,641
ఇంటర్ విద్యార్థులు 33,974

జగిత్యాల
పదో తరగతి విద్యార్థులు 11,887
ఇంటర్ విద్యార్థులు 14,252

రాజన్న సిరిసిల్ల
పదో తరగతి విద్యార్థులు 6,767
ఇంటర్ విద్యార్థులు 8,110

పెద్దపల్లి
పదో తరగతి విద్యార్థులు 7,392
ఇంటర్ విద్యార్థులు 10,566

**ఆహారం విషయంలో జాగ్రత్త**

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సమయం ప్రకారం ఆహారం తీసుకోవాలి. మాంసాహారం, మసాలాలకు దూరంగా ఉండాలి. రోజూ ఉడికించిన కోడి గుడ్డు తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ప్రొటీన్లు అందుతాయి. స్నాక్స్‌గా డ్రైఫ్రూట్స్ తీసుకోవడం మేలు. భోజనంలో ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి.- బుర్ర స్ఫూర్తి, డైటీషియన్, కరీంనగర్

# ఉన్నవి పెంచలే.. కొత్తవి మంజూరు కాలే

కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లు ఎప్పుడిస్తుందోనని జిల్లాలోని అర్హులైనవారు ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఆసరా పథకంలో భాగంగా వృద్ధులు, వికలాంగులు, గీత, చేనేత కార్మికులు, వితంతువులకు రూ.2016 మంజూరు చేసింది. దివ్యాంగులకు మాత్రం రూ.3016 నుంచి గత ఎన్నికల సమయంలో రూ.వెయ్యి పెంచి రూ.4016 అందించింది. తాము అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వచ్చి ఏడాది గడిచినా కొత్తవి మంజూరు కాకపోవడంతో సుమారు 2500 మందికి పండుగ పూట నిరాశే ఎదురైంది.

**కేబినెట్ సమావేశంలో చర్చే లేదు**ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశాల్లో పింఛన్ పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో అర్హుల్లో నిరుత్సాహం వ్యక్తమైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎంపీడీవోలు పలు దరఖాస్తులు ఆమోదించి గ్రామీణాభివృద్ధిశాఖకి పంపినవి దాదాపు వెయ్యివరకు ఉన్నాయి. ఇవి కాకుండా రెండున్నర సంవత్సరాలుగా కొత్త పింఛన్ దరఖాస్తులు తీసుకోలేదు. మొత్తం 2500మంది వరకు అర్హులు ఎదురుచూస్తున్నారు. వీరితోపాటు పింఛన్ల పెంపు కోసం 1,37,721మంది లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. దివ్యాంగులకు రూ.4016 ఇస్తుండగా మిగతా అందరికి రూ.2016 వస్తున్నాయి.



# ప్రకృతి వనాలా.. అడవులా..?

కారేపల్లి : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 'పల్లె ప్రకృతి వనాల'ను ఏర్పాటు చేసింది. తొలుత స్థలాల కొరత ఏర్పడినా.. అందుబాటులో ఉన్న స్థలాల్లోనే మొక్కలను నాటించారు. గత ప్రభుత్వ హయాం వరకు వాటి నిర్వహణను స్థానిక పాలకవర్గాలు, అధికారం యంత్రాంగం ఎలాగోలా నెట్టుకొచ్చింది. గత రెండేళ్లుగా ఆయా వనాల వైపు కన్నెత్తి చూసిన నాథుడు లేదు. కొన్నిచోట్ల వనాలు ఎండి.. ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి నెలకొంది. మరికొన్ని ప్రదేశాల్లో రక్షణ కంచెల్లేక పశువుల సంచరిస్తున్నాయి.

**రూ.కోట్ల ప్రజాధనం వృథా**

ప్రకృతి వనాలకు లభ్యతను బట్టి అరెకరం నుంచి పదెకరాల వరకు స్థలాలు కేటాయించారు. చిన్నవాటిల్లో 2-4 వేలు, పెద్ద వనాల్లో



సుమారు 20 వేల మొక్కలు నాటించారు. ఇందుకోసం రూ.2-6 లక్షల వరకు నిధులను ప్రభుత్వం వెచ్చించింది. వాటి నిర్వహణకు సంబంధించి కూలీల ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా మళ్లించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, గత రెండేళ్లుగా వనాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా దాదాపు ఇదే పరిస్థితి.

కారేపల్లి మండలంలోని తులిస్యాతండాలో ఏర్పాటు చేసిన వనాల్లో పట్టుమని పది మొక్కలు కనిపించడం లేదు. ఇక్కడి నర్సరీకి సూచిక బోర్డు మాత్రమే మిగిలింది.

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నారాయణపురం వనంలో గడ్డిమొక్కలు ఏపుగా పెరిగాయి. ఒకప్పటి వనం ఇప్పుడు చిట్టడవిని తలపిస్తోంది. భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం మైలారంలోని ప్రకృతి వనం నర్సరీలో మొక్కలన్నీ ఎండిపోయాయి. పినపాక మండలం సీతారాంపురంలో అటవీ ప్రాంతంలోనే వనాన్ని ఏర్పాటు చేశారు. నిర్వహణ లేకపోవడంతో అక్కడి మొక్కలు చనిపోయాయి. ఉమ్మడి జిలాలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యత ఆయా పంచాయతీలతో పాటు మండల స్థాయి అధికారులపై ఉంది. నిబంధనల ప్రకారం ఎంపీడీవో, ఏపీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు వనాల సంరక్షణను పట్టించుకోవాలి. నిర్వహణ సక్రమంగా లేనిచోట పరిశీలించి.. క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడతాం. వనాల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి, ఖమ్మం

# రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం భళా..!

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిల్లో ఖమ్మం కార్యాలయం నుంచే ప్రభుత్వానికి గణనీయ ఆదాయం లభిస్తుంది. గతేడాది రాబడి మరింత పెరగడం విశేషం. వివరాల్లోకి వెళ్తే.. 2024లో ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 13,526 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. వీటి ద్వారా రూ.99.51 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు 2023లో 14,078 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినా.. రూ.96.82 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. ఖమ్మం జిల్లాలో 7, భద్రాద్రి కొత్తగూడెం



జిల్లాలో 4 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రభుత్వానికి లభించే ఆదాయంలో మొత్తం 11 కార్యాలయాల్లో ఒక్క ఖమ్మం నుంచే 50 శాతం వరకు వస్తుంది. మిగతా పది కార్యాలయాలూ కలిసి ఖమ్మం ఆదాయంతో పోటీ పడుతుంటాయి.

**ఎన్నికలతో మందగించినా..**

2024లో పార్లమెంటు ఎన్నికలు నిర్వహించగా ఎన్నికల కోడ్, ఇతర కారణాలతో సుమారు ఆర్నెల్లు స్థిరాస్తి వ్యాపారం మందగించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత స్థిరాస్తుల క్రయ, విక్రయ లావాదేవీలు కొంత పెరిగాయి. దీంతో ఖమ్మంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలు ఉందని, క్రయ, విక్రయ లావాదేవీలు పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

# 44 గ్రామాలు.. 42,000 ఎకరాలు

కొత్తగూడెం : 'రైతు భరోసా' పథకం కింద పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. సాగయ్యే పొలాలకే పథకం వర్తింపజేసే యోచనలో ఉంది. అర్హుల నిర్ధారణకు శాటిలైట్ సర్వేను ప్రామాణికంగా తీసుకోవాలని తొలుత భావించింది. ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వెల్లడికావడంతో మండలానికో గ్రామం చొప్పున పంటల నమోదు(క్రాప్ బుకింగ్)కు శ్రీకారం చుట్టింది. యాప్‌లో నమోదు చేసే ఆయా వివరాలను, 'శాటిలైట్ సర్వే'తో సరిపోల్చాలన్నది యోచన. దీని ప్రకారం 8వ తేదీలోగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 44 గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో విస్తరణాధికారు(ఏఈవో)లు పంటల నమోదు ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది.

సర్వే ఇలా.. ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే నంబరు, దాని పరిధిలోని మొత్తం విస్తీర్ణం, ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఏఏ పంటలు సాగుచేశారు? అనే వివరాలను ఏఈవోలు నమోదు చేస్తారు.

సర్వేకు సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చిన అనంతరం, క్షేత్రస్థాయిలో పంటల వివరాలు విధి విధానాల ప్రకారం నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

సోమవారం నుంచి మూడ్రోజుల పాటు పైలెట్ గ్రామాల్లో సర్వే జరిగే అవకాశముంది.

'మండలానికో గ్రామం చొప్పున సాగు భూముల పూర్తి వివరాలను నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశించింది. దీనికనుగుణంగా పైలెట్ గ్రామాలను ఎంపిక చేశాం. మూడ్రోజుల్లోగా ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటాం'. బాబురావు, జిల్లా వ్యవసాయాధికారి, భద్రాద్రి కొత్తగూడెం

# ఇదేనా.. పుత్రోత్సాహం!

నల్గొండ : జిల్లా పెద్దవూర మండలంలో భార్యతో విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న కుమారుడు తండ్రితో గొడవపడి, రాయితో తలపై కొట్టి నిర్దాక్షిణ్యంగా అంతమొందించాడు. నల్గొండ జిల్లా నిడమనూరులో నివాసముంటున్న దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. పన్నెండేళ్ల క్రితమే కుమార్తెకు వివాహం జరిపించగా పిల్లలు లేరనే మనస్పర్థల కారణంగా భార్యాభర్తలు విడిపోయారు. ఆమెకు రెండో వివాహం జరిగింది. ఆ పెళ్లికి తల్లిదండ్రుల మద్దతుందనే అనుమానంతో కుమారుడు కత్తితో కన్నతల్లి గొంతు కోసి, కడుపులో పొడవడంతో ఆమె ప్రాణాలు విడిచింది. ఇటీవల సూర్యాపేట జిల్లాలో ఓ వృద్ధుడి చేయి విరిగింది. తాను సంపాదించిన ఆస్తులు అనుభవిస్తున్న కుమారులు చికిత్స చేయించేందుకు ముందుకు రాలేదు. నొప్పిని భరించలేని ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు.

మీ జీవితంలో ఇద్దరు వ్యక్తులను మర్చిపోకండి.. నిన్ను గెలిపించడానికి సర్వస్వం కోల్పోయిన నాన్నను.. ప్రతి బాధలో మీతో ఉన్న అమ్మను.
అబ్దుల్ కలాం

తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు పుట్టనేమి వాడు గిట్టనేమి..
పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా..
వేమన శతకంలోని నీతి పద్యం

అమ్మా..నాన్నలు ఆప్యాయతా సాగరం లాంటివారు. తీర్చుకోలేని నిస్వార్థ త్యాగాల రుణం వారిది. వారు లేకుంటే జన్మలేదు.. జీవితానికి వెలుగే లేదు. పస్తులుండైనా కన్న బిడ్డల కోసం కష్టాలు సహించే జీవన గమనం వారిది. అంత గొప్ప మనసున్న తల్లిదండ్రులకు పుత్రోత్సాహం లేకుండా చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు.

కళ్లు కనిపించని తల్లిదండ్రులను శ్రవణ కుమారుడు తన భుజాలపై మోసుకుంటూ వెళ్లి పుణ్యక్షేత్రాలు చూపించడం మనం పురాణాల్లో చదువుకున్నాం. అలాంటి నేలపై పుట్టిన మనలో కొందరు కన్నవారికి రాచి రంపాన పెడుతున్నారు. ఆయనలా భుజాలపై మోసుకెళ్లాలని మన తల్లిదండ్రులు చెప్పడం లేదు. చరమాంకంలో ఉన్నవారికి ఇంత కూడు, మంచి పలకరింపు ఇవే కోరుకుంటున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తున్న ఘటనలు 'మాతృదేవోభవ.. పితృదేవోభవ' అన్న మాటల అర్థాలే మార్చేస్తున్నాయి. కొందరైతే వయసుడిగిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వేస్తున్నారు. కొడుతున్నారు.. చంపేస్తున్నారు. పాలు పట్టి..నీళ్లు పోసి..భుజాలకెత్తుకున్న చేతులు నేడు వారికి భారంగా పరిణమిస్తున్నాయి.

**ఎటు పోతున్నాం..**

మన తాతల నాటి కాలంలో కన్నవారిని కంటికి రెప్పలా చూసుకునే వారు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిచ్చేవారు. ఉమ్మడి కుటుంబాలు వారు చెప్పినట్లుగా నడుచుకునేవి. కొడుకులు, కోడళ్లు, మనువలు, మనువరాళ్లు వీరందరి మధ్య ఆనందంగా గడుపుతూ హాయిగా కన్నుమూసేవారు. నేడా పరిస్థితులేవీ..? చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా.. పిల్లల కోసం తన సంపా'ధన' జీవితం అన్నట్లుగా బతికిన నాన్న నేటి తరానికి భారమై పోతున్నాడు. మాకేం చేశావు.. ఏం సంపాదించావు..? అంటూ దూషిస్తున్నారు. మలిసంధ్యలో వారి పట్ల కుమారులు కిరాతకంగా వ్యవహరిస్తున్న ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నాయి. మద్యానికి బానిసైన కొందరు కొడుకులైతే వారిని హత్య చేస్తున్నారు. సేవ చేసే సమయం లేని ఇంకొందరు వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న పరిస్థితులున్నాయి. పట్టించుకోవడం లేదని, ఆస్తిని కాజేశారని, దాడి చేశారని వృద్ధులు పోలీసులను ఆశ్రయించడం కలచి వేసే అంశమే. సమాజంలో రోజూ ఎక్కడో చోట అమ్మా..నాన్న కన్నీటిని దిగమింగుకుంటూనే ఉన్నారు.

**పంతం.. పెద్దాయన సొంతం..**

65ఏళ్లు దాటిన వారు తమ శక్తిని కోల్పోతారు. వారి ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఇతరుల సాయం అవసరముంటుంది. వయసు పెరిగే కొద్దీ మొండిగా మారుతారు. ఇదే సమయంలో సంసార భారం మోస్తున్న వారి కుమారుల ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. దీంతో ఒకరి నిర్ణయాలతో ఒకరు ఏకీభవించలేరు. వారి పంతాలను నెగ్గించుకునే క్రమంలోనే గొడవలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగానే కుటుంబాల్లో చాలా వరకు గొడవలకు దారి తీస్తున్నాయి.

**ఇది కదా బాధ్యత..**

వృద్ధ తల్లిదండ్రుల స్థితిగతులకు అనుగుణంగా వారితో మాట్లాడాలి. వారి ఆరోగ్య, మానసిక స్థితిని అర్థం చేసుకొని ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి. ఏదైనా కోపంలో రెండు మాటలంటే కనిపెంచిన వారే కదా అని సరిపుచ్చుకోవాలి. వారి అవసరాలను గుర్తిస్తూ.. సమకూరుస్తూ.. ముందుకు సాగాలి. లోకం మెచ్చిన బిడ్డగా మీరూ ఎదగాలి.

ఇటీవల హెల్పేజ్ ఇండియా సంస్థ సర్వే ప్రకారం వృద్ధులను వేధిస్తున్న వారు (శాతాల్లో)

బంధువులు 36
కుమారులు 35
కోడళ్లు 21
ఇతరులు 8

ఉమ్మడి కుటుంబాల కనుమరుగుతోనే..
బోయపల్లి రాంశెట్టి, విశ్రాంత ప్రధానాచార్యులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నాంపల్లి

# కొత్త వారికి మెప్మాలో చోటు

సూర్యాపేట : పట్టణాల్లో మహిళా సంఘంలో చేరని మహిళలకు మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) చర్యలు తీసుకుంటోంది. ప్రతి మహిళకు సభ్యత్వం కల్పించేందుకు రాష్ట్ర మెప్మాశాఖ ఆదేశాలు జారీచేసింది. సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల పురపాలికలు ఉన్నాయి. ఈ ఐదు పురపాలికల్లో 5,325 సంఘాలుండగా మొత్తం 52,493 మంది సభ్యులు ఉన్నారు. వీరితోపాటు కొత్తగా మహిళలను సంఘంలో చేరుకోవాలని ఆదేశాలు వచ్చాయి.

**సర్వే నిర్వహించి.. నమోదు చేయాలి** పట్టణంలో జనవరి చివరి వారం వరకు కొత్త వారికోసం సర్వే నిర్వహించి వారి వివరాలు అంతర్జాలంలో నమోదు చేయాలి. కాగా ఫిబ్రవరి మొదటి వారంలో వారితో సమావేశాలు నిర్వహించి గ్రూపులుగా విభజించాలి. వీరికితోడు ఇదివరకు సంఘంలో ఉండి వెళ్లిపోయిన వారిని కూడా గుర్తించి అవగాహన పర్చాలి. సంఘంలో సభ్యత్వం ఇచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకంలో రుణాలు ఇప్పించాలి. రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మెప్మా అధికారులు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు18 ఏళ్లు నిండి పట్టణంలోని తెల్లరేషన్ కార్డుదారులు సంఘంలో అర్హులు. సంఘంలో చేరిన మహిళలు రుణాలు పొంది వ్యాపారంలో రాణించవచ్చు.సంఘంలో రుణం పొంది ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.10 లక్షలు, సాధారణ మరణమైతే రూ.2 లక్షల వరకు బీమా ఉంటుంది. సంఘంలో చేరిన తర్వాత వ్యక్తిగతంగా రూ.3.50 లక్షలు రుణం పొందేందుకు అర్హులు.
రుణాలు పొందడం, వ్యాపార నిర్వహణపై అధికారులు శిక్షణనిస్తారు.

# సన్నాహాలు షురూ..!



నల్గొండ : వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీ కాలం ఈ ఏడాది మార్చిలో పూర్తి కానుంది. కొత్త ఎమ్మెల్సీని ఎన్నుకునేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**అన్ని మండల కేంద్రాల్లోనూ..**ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఉపాధ్యాయుల ఓటర్ల ముసాయిదా, తుది జాబితాలను విడుదల చేసింది. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులకు అన్ని మండల కేంద్రాల్లో 77 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2019లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా కంటే 2024 జాబితాలో ఓటర్లు అధికమయ్యారు.

**వసతులపై ఆరా..**

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో వసతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. తాగునీరు, విద్యుత్తు, ప్రహరీ, ర్యాంపులు, మరుగుదొడ్లు, ఉన్నాయా? లేవా పరిశీలిస్తున్నారు. వసతుల ప్రక్రియను నివేదిక రూపంలో పొందుపరుస్తున్నారు. ఒక్కో కేంద్రంలో గరిష్ఠంగా వెయ్యి మంది కనిష్ఠంగా 500 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. దూరాభారం తగ్గించడంతో పాటు పోలింగ్ మెరుగయ్యేందుకు కొత్త మండలాల్లోను కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.

**నమోదుకు అవకాశం**

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటన వెలువడే వరకు ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరించడానికి వీలుంది. తుది జాబితా విడుదలైనప్పటికీ అర్హులైన కొత్త ఓటర్ల కోసం ఈ అవకాశం కల్పించారు. ఓటర్ల సంఖ్య ఎక్కువైతే పోలింగ్ కేంద్రాలను కూడా పెంచాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే రెండుమార్లు అవకాశం ఇవ్వగా.. ఈసారి ఎంతమంది దరఖాస్తు చేసుకుంటారో చూడాలి.

**మచ్చిక చేసుకుంటున్న అభ్యర్థులు** ఎమ్మెల్సీ ఎన్నికలు ఏప్రిల్‌లో జరిగే అవకాశం ఉండటంతో ఆయా ఉపాధ్యాయ సంఘాల నుంచి పోటీకి దిగే అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. తమకు అనుకూలమైన సంఘాల వారితో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్లలో అభ్యర్థుల ప్రచార ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. తమను గెలిపిస్తే పరిష్కరించనున్న ఉపాధ్యాయ సమస్యల గురించి చర్చిస్తూ హామీలు ఇస్తున్నారు.

# స్వచ్ఛ నగరానికి సింగరేణి తోడ్పాటు



గోదావరిఖని : రామగుండం నగరపాలికకు డంపింగ్‌యార్డు సమస్య తీరనుంది. మూతపడిన సింగరేణి ఉపరితల గని-4 సంబంధించిన సుమారు 10 ఎకరాల స్థలాన్ని డంపింగ్‌యార్డు ఏర్పాటుకు అప్పగించడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. సుమారు రెండున్నరేళ్లుగా డంపింగ్‌యార్డు లేక నగరంలో ఎక్కడ పడితే అక్కడే చెత్తపడేసే పరిస్థితులు ఉన్నాయి. గోదావరి ఒడ్డున సమ్మక్క జాతర స్థలం, రామగుండం ఎరువుల కర్మాగారం పంపుహౌస్ స్థలంలో కొంతకాలంగా చెత్త వేస్తున్నారు. జిల్లా కలెక్టర్, నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్, అదనపు కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ, సింగరేణి యాజమాన్యం సహకారంతో డంపింగ్ యార్డుకు అడుగులు పడుతున్నాయి.

**ఆది నుంచి సమస్యే**

గతంలో సింగరేణి జీడీకే 11ఎ గని సమీపంలో నగరంలోని చెత్త పడేసేవారు.సుమారు రెండున్నరేళ్ల క్రితం సింగరేణి ఉపరితల గని విస్తరణలో భాగంగా డంపింగ్‌యార్డుకు ఉపయోగిస్తున్న స్థలాన్ని యాజమాన్యం స్వాధీనం చేసుకోవడంతో నగరపాలికకు డంపింగ్‌యార్డు సమస్య తీవ్రమైంది.నగరపాలిక సుమారు దశాబ్దం క్రితమే రామగుండంలోని ప్రభుత్వ స్థలంలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మాణంతో పాటు చెత్త నిర్వహణకు అవసరమైన యంత్రాలు సైతం బిగించారు. నివాసాల పక్కనే డంపింగ్‌యార్డు ఉండటంతో స్థానికులు అడ్డుకోవడంతో పాటు కొన్నిసార్లు చెత్త ట్రాక్టర్ డ్రైవర్లపై దాడులకు పాల్పడ్డారు. దీంతో చెత్త తరలింపును నిలిపివేశారు. పి.కె.రామయ్యకాలనీ సమీపంలోని రాముని గుండాల గుట్ట పరిసరాల్లోని క్వారీల స్థలాన్ని డంపింగ్‌యార్డు కోసం రెవెన్యూ అధికారులు సూచించారు. కానీ కాలనీతో పాటు పరిసర ప్రాంతవాసులు అడ్డుకోవడంతో ఆగిపోయారు. ఆ తర్వాత లక్ష్మీపురం సమీపంలోని ఎరువుల కర్మాగారం స్థలంలో చెత్త వేస్తుండగా స్థానిక కార్పొరేటర్‌తో పాటు స్థానికులు వ్యతిరేకతతో నిలిచిపోయింది.
ఎక్కడ స్థలం లేకపోవడంతో ప్రస్తుతం గోదావరి ఒడ్డున సమ్మక్క సారలమ్మ జాతర స్థలంలో చెత్త వేస్తున్నారు. హిందూ స్మశానవాటికకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన చెత్త వేయడం, కాల్చడంతో గోదావరికి స్నానాలకు, స్మశానవాటికకు వచ్చేవారు తీవ్ర ఇబ్బంది పడేవారు. వర్షాకాలంలో చెత్త గోదావరిలో కలుస్తుండేది. గతేడాది సమ్మక్క జాతర సమయంలో చెత్తపైనే మట్టిపోయించి ఏర్పాట్లు చేశారు.
గోదావరి ఒడ్డునే రామగుండం ఎరువుల కర్మాగారానికి సంబంధించిన స్థలాన్ని డంపింగ్‌యార్డుగా వినియోగించడంతో నది కాలుష్య కారకమైంది.

# మరింత చేరువగా సహకారం



మంథని: రాష్ట్రంలో కొత్తగా దాదాపు 500 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి మండలంలో రెండు సంఘాలుండాలని భావిస్తుండగా జిల్లాలో మంథని మండలం నుంచి వెంకటాపూర్, గుంజపడుగు గ్రామాల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఇవి కార్యరూపం దాలిస్తే రైతులకు సేవలు మెరుగవనున్నాయి.ప్రస్తుతం మండలంలో మంథని సహకార సంఘం ఒక్కటే ఉంది. ఇందులో 3,523 మంది రైతులు సభ్యులుండగా ఉండగా స్వల్పకాలిక రుణాల కింద 784 మందికి రూ.6.73 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద 176 మందికి రూ.5.02 కోట్లు ఇచ్చారు. 76 మంది రైతులకు వ్యక్తిగత, ఇతర రుణాల కింద రూ.25.50 లక్షలు పంపిణీ చేశారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయాలు, రుణాలపై వడ్డీలు కలిపి ఏటా సంఘానికి రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్లు, ఇతర వ్యాపారాలతో రూ.150 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. సంఘం పరిధిలో 35 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా దాదాపు రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

**తగ్గనున్న వ్యయ ప్రయాసలు**

ప్రసుతం మంథని సంఘం పరిధిలో 35 పంచాయతీలున్నాయి. కొన్ని గ్రామాల రైతులు సంఘం కార్యాలయానికి రావాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కొత్త సంఘాల ఏర్పాటుతో 5 కిలోమీటర్ల దూరంలోనే కార్యాలయం ఉంటుంది. మంథని సంఘం పరిధిలో మొత్తం 3,523 సభ్యులుండగా సకాలంలో రుణాలు మంజూరు కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త సంఘాల్లో తక్కువ మంది సభ్యులుండటం వల్ల జాప్యం నివారించవచ్చు.
రైతులు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం మంథనికి రావడానికి వ్యయ ప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తోంది. సమీపంలో సంఘాలుండటం వల్ల దూరాభారం తగ్గడంతో పాటు పనులు సకాలంలో జరిగే అవకాశం ఉంది. కొత్త సంఘాలతో ప్రతి గ్రామం నుంచి ఒక డైరెక్టర్ ఎన్నికయ్యే అవకాశం ఉంటుంది.
అందుబాటులో వనరులుః మంథని మండలంలో గతంలో మంథని, నాగారం, వెంకటాపూర్ సంఘాలుండేవి. నాగారం, వెంకటాపూర్ సంఘాలకు ఆదాయం లేకపోవడంతో 2009లో మంథని సొసైటీలో విలీనం చేశారు.ః కొత్తగా ఏర్పాటు కానున్న వెంకటాపూర్ సంఘం పరిధిలో వెంకటాపూర్, మల్లారం, ఆరెంద, స్వర్ణపల్లి, నాగేపల్లి, అడవిసోమన్‌పల్లి, భట్టుపల్లి, ఖాసాయిపేట గ్రామాలుండగా 820 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వెంకటాపూర్‌లో రూ.26 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదాం ఉంది. ఆరెందలో 11 గుంటల స్థలం అందుబాటులో ఉంది.
ః గుంజపడుగు సంఘం పరిధిలో గుంజపడుగు, సిరిపురం, దుబ్బపల్లి, చిల్లపల్లి, బెస్తపల్లి, ఉప్పట్ల, పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, రచ్చపల్లి, అక్కెపల్లి గ్రామాలుండగా 724 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. నాగారంలో సంఘానికి మూడు ఎకరాల స్థలం ఉంది.

# ఉలిక్కిపడ్డ పెద్దకందుకూరు

యాదగిరిగుట్ట : పరిశ్రమ కార్మికులే కాదు.. పరిశ్రమకు అయిదు కిలోమీటర్ల మేర ఉన్న పల్లెలు ఉలిక్కిపడ్డాయి. మూడు సార్లు భారీ శబ్దాలు వెలువడటం, అది భారత వాయుసేన (ఎయిర్ ఫోర్స్)కు పేలుడు ఉత్పత్తులను సరఫరా చేసే మండలంలోని పెద్దకందుకూరులోని ప్రసిద్ధ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ కావడం అందుకు కారణం. భారీ పేలుడు ముడి సరకులు, ఉత్పత్తులు నిల్వ ఉండే ఆ ప్రాంతం చాలా సున్నితత్వం. ఏ మాత్రం ఏమరుపాటు వహించినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఈ ప్రాంతంలో ఎందరికో ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమలో జరిగే విస్ఫోటన ఉగ్రరూపం చవిచూస్తూ కార్మికులు జాగ్రత్తలు వహిస్తూనే ఉంటారు. కానీ ఏం జరిగిందో ఏమో.. పరిశ్రమలోని పీఆర్‌డీసీ విభాగం వద్ద పేలుడు జరిగింది. ఈ ధాటికి మార్క కనకయ్య (50) అనే కార్మికుడు మృతి చెందగా, మొగలిపాక ప్రకాశ్ అనే కార్మికుడు తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. సాదువెల్లి నర్సింహులు, జి.వేణుగోపాల్‌లకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. 1989లో ప్రారంభమైన ఈ పరిశ్రమ భారత వాయుసేన (ఎయిర్ ఫోర్స్), రక్షణ దళాలకు పేలుడు పదార్థాలను సరఫరా చేస్తోంది. పరిశ్రమలో 396 మంది కార్మికులు, 80 మంది అధికారులు, మిగతా కాంట్రాక్ట్ సిబ్బందితో కలిపి మొత్తం 600 మంది పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలో పీఆర్‌డీసీ విభాగం ఉంది. దీంట్లో 12 నుంచి 16 మంది పనిచేస్తుంటారు.



పేలుడు పదార్థాల తయారీకి వినియోగించే ముడి పదార్థాలైన మెగ్నీషియమ్, టెఫ్లాన్, వైబ్రాయిటర్‌లను మిశ్రమంగా చేసి కంప్రెస్‌తో ముద్దగా (ఐఆర్ ఫ్లేర్స్) మల్చడం దీంట్లో ప్రక్రియ. గతంలో ఇది మాన్యువల్‌గా ఉండగా, ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం జరగకుండా యంత్రాలతో ఆటోమెటిక్‌గా రూపొందించారు. ముడి సరకు ముద్దగా మారి, ఆరిపోయేంత వరకు గది తలుపు తెరవరు. ఆరిన బిల్లలను మాత్రం మాన్యువల్‌గా ఒక చోట చేర్చాల్సిన పనులను కార్మికులు చేస్తుంటారు. రెండు షిఫ్టులుగా నడిచే ఈ పరిశ్రమలో పీఆర్‌డీసీ విభాగంలో మాత్రం పేలుడు నిల్వల నేపథ్యంలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే నడుస్తోంది. పేలుడు, ప్రాణనష్టం జరగకుండా ఎంతో కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఉన్నప్పటికీ శనివారం జరిగిన పేలుడు అంతచిక్కకుండా ఉందని పరిశ్రమ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ చేస్తూ, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉదయం 6 గంటలకు వెళ్లే కార్మికులు 10 గంటలకు భోజన విరామం తీసుకుంటారు. పేలుడు సంభవించిన 9:45 గంటల సమయంలో ఆ సెక్షన్‌తో పాటు మిగతా సెక్షన్‌లోని చాలా మంది కార్మికులు ఆ ప్రాంతం నుంచి భోజనానికి సిద్ధమవుతూ క్యాంటిన్ వైపుగా వెళ్లారు. ఆ సమయంలో వారు అక్కడ ఉండకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. 2019 సెప్టెంబరు 29న ఇదే చోట పేలుడు ప్రమాదం జరిగి పెద్దకందుకూరు గ్రామానికి చెందిన గుర్రం జైపాల్ అనే కార్మికుడు చనిపోయాడు. అప్పుడు అక్కడ మ్యాన్యువల్ విధానం ఉండటంతో అలా జరిగిందని ఆటోమెటిక్ విధానం తీసుకువచ్చారు. 2012లో మరో విభాగంలో జరిగిన ప్రమాదంలో ఆలేరుకు చెందిన ఎల్లయ్య, వంగపల్లికి చెందిన మోహినుద్దిన్ మృతి చెందారు. ఆ సమయంలో పేలుడుతో స్లాబ్ కూలడం వల్ల ఎక్కువ ప్రమాదం జరుగుతుందని తెలిసి స్లాబ్‌లకు బదులు రేకుల విధానం తీసుకువచ్చారు. రేకులు లేచిపోవడం వల్లే సుదూర ప్రాంతానికి శబ్దం వినిపించిందని పరిశ్రమ అధికారులు తెలిపారు.

# మూడేళ్లయినా ముందుకు సాగదే!

భువనగిరి : మూస ధోరణి సాగులోకి పోకుండా ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని ప్రభు త్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఆయిల్‌పాం సాగుపై ప్రత్యేక రాయితీనిస్తూ ప్రోత్సహిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో సేద్యానికి రైతులు ఆసక్తి చూపడం లేదన్నది వాస్తవం. జిల్లా ఉద్యానశాఖ లక్ష్యాన్ని నిర్దేశించి సాగు కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ విషయమై రైతులకు పలు దఫాలుగా అవగాహన కల్పిస్తుండటంతో కొంతమేర రైతుల నుంచి సానుకూల ధోరణి కనిపిస్తోంది. ముఖ్యంగా ఆయిల్‌పాం సాగులో అధిక లాభాలున్నాయని అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

**అంతర పంటలకూ లాభసాటి..**

ప్రత్యేకంగా ప్రతి జిల్లాకు ఒక నర్సరీ చొప్పున మోత్కూరు మండలం పాలడుగులో ఆయిల్‌పాం నర్సరీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేఎన్ బయోసైన్స్ సంస్థ ఈ మొక్కలను రైతులకు నేరుగా సరఫరా చేస్తోంది. ఈ నర్సరీలో సుమారు రెండున్నర లక్షల ఆయిల్‌పాం మొక్కలు అందుబాటులో ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఆసక్తి గల రైతు తన సాగుభూమిలో ఒక ఎకరానికి 57 మొక్కలు అవసరం ఉంటాయని అంచనా. ఒక్కొక్క మొక్కను 9 మీటర్ల వెడల్పుతో నాటుతారు. పెద్దగా అయ్యేంత వరకు నాటిన ఆయిల్‌పాం మొక్కల మధ్య అంతర పంటలుగా పూలు, పండ్లు, కూరగాయలు తదితరాలు కూడా సాగు చేసుకునే అవకాశం ఉంది. రాజపేట మండలం చల్లూరు లో రాజిరెడ్డికి చెందిన ఆయిల్‌పాం సాగులో అంతరపంటగా గత రెండేళ్లుగా గుమ్మడి సాగును, బొమ్మలరామారం మండలంలో పసుపు రంగులోని కర్బూజ సాగును చేపడుతూ ఉపాధి పొందుతున్నారు.

**రాయితీపై పరికరాలు**

ఆయిల్‌పాం సాగులో భాగంగా ప్రభుత్వం రైతులకు బిందు సేద్యం పరికరాలు, మొక్కలపై రాయితీ ఇస్తోంది. మొక్కలకు నీరందించేందుకు బిందు సేద్యం యూనిట్ విలువ రూ.53,465 ఉండగా, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ ఇస్తుంది. బీసీ, జనరల్ రైతులకు 90 శాతం రాయితీ ఇస్తుండగా, యూనిట్ విలువలో 10 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది. ఐదెకరాలు దాటితే మాత్రం 60 శాతం రాయితీ వర్తిస్తుంది. మొక్కలను సాగు చేసేందుకు ఏడాదికి దశలవారీగా రూ.4,200 చెల్లిస్తుంది. ఈ సొమ్మును నాలుగేళ్లపాటు ఉద్యానవన శాఖ అధికారులు అందించనున్నారు.

**మూడేళ్లలో సాగు ఇలా..**

శాఖ పరంగా లక్ష్యం : 12,500 ఎకరాలు
సాగు చేసింది : 4,292
రైతుల సంఖ్య : 971

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం ప్రవీణ్‌కుమార్, ఆయిల్‌ఫెడ్ జిల్లా సమన్వయకర్త, యాదాద్రి భువనగిరి ఆయిల్‌పాం సాగు చేసుకునేలా ఉద్యానవనశాఖ సహకారంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ విషయమై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పంటవల్ల కలిగే లాభాలు, దిగుబడి, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల గురించి వివరిస్తున్నాం. ఇప్పుడిప్పుడే ఆయిల్‌పాం సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేస్తామనే నమ్మకం ఉంది.

# ఉల్లంఘించిన రోజులూ లెక్కలోకి!

హైదరాబాద్: కాలుష్య పరిశ్రమలు, ఆర్ఎంసీలపై పీసీబీ కొరడా ఝుళిపిస్తోంది. ఉల్లంఘనల కాలాన్ని లెక్కగట్టి పర్యావరణ నష్టాన్ని వసూలు చేస్తోంది. ఈ ఏడాదిలో 70కి పైగా పరిశ్రమలు, నిర్మాణ రంగ ప్రాజెక్టులపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోగా అందులో 20కి పైగా నిర్మాణ రంగ ప్రాజెక్టుల్లో ఆర్ఎంసీ(రెడీ మిక్స్ కాంక్రీట్)లను గుట్టుగా నడపడంపై ఫిర్యాదులు అందాయి. టాస్క్‌ఫోర్స్ బృందం ఆయా ప్రాజెక్టుల్లో తనిఖీలు జరిపి కాలుష్య ఉద్గారాల స్థాయిని లెక్కగట్టి చర్యలు తీసుకుంది.

**వసూలు ఇలా..**

కూకట్‌పల్లిలోని ఆర్ఎంసీ నిర్వాహకులపై కాలుష్య నియంత్రణ మండలి ఇటీవల చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘించిన 144 రోజులను లెక్కగట్టి రూ.10,80,000 చెల్లించాలని ఆదేశించింది. పొల్యూషన్ ఇండెక్స్(30), నిబంధనల ఉల్లంఘన కాలం(144), లొకేషన్ ఫ్యాక్టర్ (2.0), ఆర్ఎంసీ చిన్నది కావడంతో స్కేల్ ఆఫ్ ఆపరేషన్ (0.5) ఫ్యాక్టర్ ఆఫ్ రూపీస్ (250)గా లెక్కగట్టి నగదు 15 రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది.

**ఎలా లెక్కిస్తారంటే..**

పొల్యూషన్ ఇండెక్స్‌ను సున్నా నుంచి 100 మధ్యలో లెక్కిస్తారు. రెడ్ కేటగిరీ అయితే 60 - 100, ఆరెంజ్ కేటగిరీ అయితే 41 - 59,




గ్రీన్ కేటగిరీ అయితే 21 - 40 మధ్య పరిగణిస్తారు. లొకేషన్ ఫ్యాక్టర్ (ప్రాంతీయత)లో పదిలక్షల వరకు జనాభా ఉంటే 1.0గా, ఐదు మిలియన్ల మధ్య ఉంటే 1.25, 10 మిలియన్ల లోపు ఉంటే 1.5, పది మిలియన్లకు పైగా ఉంటే 2.0గా లెక్కిస్తున్నారు. ఫ్యాక్టర్ ఇన్ రూపీస్‌లో భాగంగా 100 నుంచి 500 వరకు లెక్కిస్తుండగా..నిబంధనల ఉల్లంఘనల అంశంలో 250గా లెక్కించాలని సీపీసీబీ సూచించింది.

**బ్యాంకు గ్యారంటీలు**

బాచుపల్లిలో లెదర్ ఫినిషింగ్, ట్యానింగ్ రసాయనాలు తయారు చేస్తున్న పరిశ్రమపై చర్యలు తీసుకుంది. కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకోవడంతో కాలుష్య ఉద్గారాల స్థాయి పెరుగుదలకు కారణమైనందుకు తాజాగా మరోసారి రూ.6లక్షల బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని ఆదేశించింది. ఫర్నేస్ ఆయిల్‌కు బదులుగా పీఎన్జీ ఇంధనం వినియోగించాలని, అమ్మోనియాకు బదులు ప్రత్యామ్నాయ రసాయనాన్ని వినియోగించాలని సూచించింది.

# భగీరథ జలం.. పరిశ్రమకు ఊతం

వికారాబాద్ : మిషన్ భగీరథ పథకం తాగునీటి అవసరాలతోపాటు పరిశ్రమలకూ ఉపయోగపడుతోంది. వాటికి నీటిని కేటాయించేందుకు గ్రిడ్ అధికారులు ముందుకొచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూమి, నీటి సదుపాయం, విద్యుత్తు ప్రధాన అవసరాలు. పూడూరు మండలం రాకంచర్ల దగ్గర పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భూమి కేటాయించింది. సోలార్, పవన విద్యుత్తు వంటి ప్రైవేట్ విద్యుత్తు సంస్థలు అందుబాటులోకొచ్చాయి. పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి 10 శాతం నీరు సరఫరా చేస్తామని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. పరిగి మండలం రాఘవాపూర్ సమీపంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంటుకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ సరపరా అవుతోంది.

**దరఖాస్తులు తక్కువే..**

పరిగి మండలం రాఘవాపూర్ వద్ద 135 ఎంఎల్‌డీ, చేవెళ్ల మండలం అంతారం వద్ద 40 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న సంపులున్నాయి. ఆ రెండింటి ద్వారా దాదాపు 17.5 ఎంఎల్‌డీ నీటిని పరిశ్రమలకు, ఇతర అవసరాలకు కేటాయించేందుకు అవకాశముంది. వీటిలో ఇప్పటి వరకు శుద్ధి చేయని నీరు 37 లక్షలు, శుద్ధి చేసింది 15 లక్షల లీటర్ల వరకు వినియోగిస్తున్నారు. పరిగి, శంకర్‌పల్లి ప్రాంతాల్లోని పరిశ్రమలకు ఈ నీటిని వాడుతున్నారు. వెయ్యి లీటర్లకు రోజుకు రూ.150 చొప్పున, వాణిజ్య అవసరాలకు రూ.90 చొప్పున వసూలు



చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భగీరథకు నెలకు రూ.45 లక్షల ఆదాయం సమకూరుతోంది.

**రాకంచర్లలో ఏర్పాటైతే ఉపయోగం..**

రాకంచర్ల దగ్గర పారిశ్రామికవాడ ఏర్పాటుకు 113 ఎకరాలు కేటాయించినా ఎవరూ ముందుకు రాలేదు. రూ.30 కోట్లు వెచ్చించి రోడ్లు, విద్యుత్తు సౌకర్యం కల్పించారు. ఉపాధి కోసం కొందరు మహిళలు రంగారెడ్డి జిల్లా కొందుర్గు సమీపంలోని బిస్కెట్ కర్మాగారాల్లో పనికి వెళుతున్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటైతే ఇలాంటి వారికి ఉపాధి దొరుకుతుంది. అన్ని వసతులుండడంతో పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశ్రమల వారు శుద్ధి చేయని నీటిని అడిగితే ప్రత్యేకించి పైప్‌లైన్ వారే ఏర్పాటు చేసుకోవాలి. శుద్ధి నీటిని మాత్రం అందుబాటులో ఉన్న వనరుల ద్వారా అందించనున్నారు. **అవకాశాలను బట్టి కేటాయిస్తాం..: చల్మారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ (గ్రిడ్)**మిషన్ భగీరథ నీటిని పారిశ్రామిక అవసరాలకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటివరకు పరిగిలో ఒక కంపెనీ వాడుతుండగా తాండూరు, వికారాబాద్ నుంచి ఎవరికీ ఇవ్వలేదు. మోమిన్‌పేట మండలం ఎన్కతల నుంచి అడిగారు. స్థానికంగా ఉన్న వనరులనుబట్టి కేటాయిస్తాం.

# ఇందిరమ్మ ఇళ్లకు సన్నాహాలు



సిరిసిల్ల : ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ పథకం విజయవంతం కావాలంటే జిల్లాలో ప్రత్యేక యంత్రాంగం అవసరం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో ఈ శాఖలో పని చేసిన 50 మంది సిబ్బంది పలు శాఖలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయితే వీరిలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందగా, మరి కొందరు మృతి చెందారు. ప్రస్తుతం ఆయా శాఖల్లో పని చేస్తున్న వారిని మాతృ శాఖలోకి తీసుకునే ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తికానుంది. జిల్లాల వారీగా గృహ నిర్మాణశాఖ కార్యాలయాలను ప్రారంభిస్తారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 గృహాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో ఉమ్మడి జిల్లాకు 45,500 ఇందిరమ్మ గృహాలు రానున్నాయి. సొంత స్థలం ఉన్న వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు రూ.2 వేల కోట్ల పైనే నిధులు వచ్చే అవకాశం ఉంది.

**అధికారులదే కీలక బాధ్యత**

ఈ పథకం అమలుకు జిల్లా స్థాయిలో పీడీలు, ఈఈలు, డీఈలు, అలాగే మండలాల్లో ఏఈలు కీలక బాధ్యత పోషించాల్సి ఉంటుంది. గతంలో మండలాల వారీగా పౌరుగుసేవల విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా పని చేశారు. ఇప్పటికే సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో నలుగురు డీఈలు, ఏఈలు చేరారు. జగిత్యాల, పెద్దపల్లి నుంచి ఒక్కొక్కరు మాత్రమే వచ్చారు. డిప్యుటేషన్‌లో పని చేస్తున్న హెచ్ఎండీఏ తదితర శాఖల నుంచి రిలీవ్ కావాలి. మరోవైపు వారు గృహ నిర్మాణశాఖలో చేరాల్సిన జిల్లాలను ఎంపిక చేసుకోవాలి. జిల్లా స్థాయిలో ఈఈ, ఇద్దరు డీఈలు, ఏఈలు ఉంటారు. ప్రతి జిల్లాకు హౌసింగ్ అధికారి, మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్‌లను నియమిస్తారు. ఇలా డివిజన్‌లు, నియోజకవర్గాల వారీగా ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బందిని కేటాయిస్తారు.

**తప్పిదాలు పునరావృతం కాకూడదని...**

గతంలో ఇందిరమ్మ గృహాల మంజూరు, నిర్మాణం, నిధుల విడుదలలో అవకతవకలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో రూ.17.50 కోట్ల మేరకు దుర్వినియోగమైనట్లు అప్పట్లో ప్రత్యేక విచారణ బృందం నివేదికలో వెల్లడైంది. తర్వాత దీనిపై ఎలాంటి కదలికలేదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలకు అవకాశం లేకుండా ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. దీనిని ప్రభుత్వం ఈ వారంలో లాంఛనంగా ప్రారంభించనుంది. ఇప్పటికే ఈ యాప్‌తో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని గృహ నిర్మాణశాఖను ప్రభుత్వం బలోపేతం చేస్తుంది.

**చొప్పదండిలో అసంపూర్తిగా నిర్మాణం**

చొప్పదండిలోని పాత వెదురుగట్ట రోడ్‌లోని రెండు పడక గదుల పరిస్థితి ఇది. ఏడేళ్ల కిందట 93 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 50 ఇళ్లకు స్లాబుతోపాటు గోడలు పూర్తి చేశారు. మరో 43 ఇళ్లకు మూడు అంతస్తులో నిర్మాణం చేసినా.. పూర్తి స్థాయిలో గోడలు నిర్మించలేదు. అయిదేళ్ల నుంచి పనుల్లో అడుగు పడటంలేదు. నిధులు రాకపోవడంతో గుత్తేదారు వదిలేశారు. చొప్పదండి వాసులకు సొంతింటి కల నెరవేరకుండా పోయింది.

**రెండేళ్లుగా బిల్లుల పెండింగ్**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలోని రెండు పడక గదుల నిర్మాణాలు అసంపూర్తి దశలో ఉన్నాయి. 2021 లోపు నిర్మాణం జరిగినవే చాలా వరకు పూర్తయ్యాయి. వాటినే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకే పరిమితమైంది. అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు 2023 వరకు పలుమార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. మరోవైపు పనులు చేసిన గుత్తేదారులకు సైతం రెండేళ్లుగా బిల్లులు రావడం లేదు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు రూ.25 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు సమాచారం.

# రూ.4వేలిస్తే.. గుర్తింపు 'పది'లం




హైదరాబాద్ : " పాతబస్తీలో ఓ ప్రైవేటు పాఠశాలలో మార్చిలో 210 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉత్తీర్ణతశాతం అత్యల్పంగా రావడంతో ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి విచారణ చేపట్టగా.. చార్మినార్ సమీపంలోని మూడు గుర్తింపులేని ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులను ఆ బడిలో చేర్చారు." ఈ వ్యవహారంలో బాధ్యుడైన అధికారిని ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు కొద్దిరోజుల క్రితం సస్పెండ్ చేశారు. మరికొన్ని మండలాల్లోనూ ఈ అక్రమాలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలు... కొందరు విద్యాశాఖ అధికారులు కలిసి పదో తరగతి విద్యార్థులను మోసం చేస్తున్నారు. గుర్తింపులేని పాఠశాలల్లో చదువుకుంటున్న వారికి పదోతరగతి పరీక్షలు రాసేందుకు అర్హత లేకపోయినా... విద్యార్థి నుంచి డబ్బులు వసూలు చేసి... గుర్తింపున్న మరో ప్రైవేటు పాఠశాలలో పేర్లు నమోదు చేస్తున్నారు.

**'యూడైస్'లో నమోదు తప్పనిసరి కావడంతో..**

సైదాబాద్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ముసారాంబాగ్, పాతబస్తీ, ఆసిఫ్‌నగర్, లంగర్‌హౌస్, అమీర్‌పేట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో గుర్తింపు లేని పాఠశాలలున్నాయి. విద్యార్థులు పదోతరగతికి రాగానే 'ప్రైవేటు' అభ్యర్థులుగా పరీక్షలు రాయిస్తున్నారు. 'యూడైస్' పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలంటూ సర్కారు ఆదేశాలు జారీచేయడంతో గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలకు ఇబ్బందులు మొదలయ్యాయి. వాటి వివరాలు పోర్టల్‌లో నమోదు చేసేందుకు అవకాశం లేకపోవడంతో గుర్తింపు ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 'పది' విద్యార్థుల పేర్లను చేర్పిస్తున్నారు. అందుకు ఒక్కొక్కరి నుంచి రూ.4వేలు వసూలు చేస్తున్నారు. అందులో రూ.3వేలు గుర్తింపున్న ప్రైవేటు పాఠశాలకు, రూ.వెయ్యి విద్యాశాఖ అధికారులకు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


**పర్యవేక్షణ లేమితోనే...** గుర్తింపులేని పాఠశాలల జాబితాను ప్రభుత్వ, మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద ప్రచురించాలి. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో ప్రైవేటు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి సహా డిప్యూటీ ఈవోలు, మండల విద్యాధికారులు తనిఖీలు నిర్వహించాలి. అందుకు విరుద్ధంగా విద్యాశాఖ అధికారులు తనిఖీలకు దూరంగా ఉంటున్నారు. గుర్తింపులేని పాఠశాలల యాజమాన్యాలు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల పేర్లను రాయిస్తున్నారు. చార్మినార్ ప్రాంతంలోని గుర్తింపులేని పాఠశాలల విద్యార్థుల పేర్లు బహదూర్‌పురలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నాయి. కిందిస్థాయిలో కొందరు విద్యాశాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా.... రాజకీయ ఒత్తిళ్లు, ఉన్నతాధికారుల ఆదేశాలతో మిన్నకుండిపోతున్నారు.

# మందులా.. మతాబులా!

హైదరాబాద్ : నగరంలో ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న ఔషధ దుకాణాలు రోగులను దోపిడీ చేస్తున్నాయి. నిర్ణీత ధర కంటే భారీగా వసూలు చేస్తూ జేబులకు చిల్లు పెడుతున్నాయి. మలక్‌పేట్ జడ్డికాలనీలోని హైదరాబాద్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో డీసీఏ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఒక్కో ఔషధం ఏకంగా 12-15 రెట్లు అధిక ధరలకు విక్రయించడాన్ని గుర్తించారు. అలెర్జీ కోసం వాడే అవిల్ ఇంజక్షన్ ఎమ్మార్పీ రూ.6.16 అయితే ఇక్కడ రూ.100 వసూలు చేస్తున్నారు. కొన్ని దుకాణాల్లో ఎమ్మార్పీపై 10-20 శాతం రాయితీ సైతం ఇస్తుంటారు. అయితే ఆసుపత్రుల అనుసంధానంగా ఉన్న దుకాణాలు ఈ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇష్టారీతిన ధరలు వేసి రోగుల నుంచి డబ్బులు గుంజుతున్నారు.

**ఎక్కువకు అమ్మితే కేసులు నమోదు చేస్తాం**

ఔషధాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. డ్రగ్స్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్, 2003 ప్రకారం ఎమ్మార్పీలోపే రోగులకు ఔషధాలు విక్రయించాలి. ఈ ఆర్డర్‌ను తుంగలోకి తొక్కితే



ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్టు 1955 ప్రకారం జైలు శిక్ష సైతం పడుతుంది. ఎక్కడైనా ఎక్కువ ధరకు ఔషధాలు విక్రయించినట్లు ప్రజలు గుర్తిస్తే ఔషధ నియంత్రణ శాఖ దృష్టికి తేవాలి. టోల్‌ఫ్రీ నెంబరు 1800-599-6969 ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. వి.బి.కమలాసన్‌రెడ్డి, డైరెక్టర్ జనరల్, ఔషధ నియంత్రణ శాఖ

# సాఫీ ప్రయాణానికి దారేదీ..?

హైదరాబాద్: నగరంలో అనేక చోట్ల రైల్వేక్రాసింగ్‌లు ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. దాదాపు 42 చోట్ల ఆర్‌యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి), ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణ, విస్తరణ పనులు చేపట్టి పరిష్కారం చూపాల్సిన యంత్రాంగంలో చలనం లేదు. జీహెచ్ఎంసీ సైతం వీటిపై అధ్యయనం చేసినా, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

**ఈ ప్రాంతాలు కీలకం..**

ఖైరతాబాద్ రైల్వేగేట్ సమీపంలో ఆర్‌యూబీ తెరవాల్సి ఉంది. 30 ఏళ్ల క్రితం ఇక్కడి నుంచే రాకపోకలు సాగేవి. ప్రస్తుతం రైల్వేగేట్ నుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. మెట్రో కారణంగా ఈ మార్గంలో రద్దీ ఎక్కువైంది. రైలు వచ్చినపుడల్లా 5-8 నిముషాలు గేటు వేయాల్సి వస్తోంది. దీంతో అనేక మంది గేటు కింది నుంచి ప్రమాదకరంగా దాటుతున్నారు.

బొల్లారం రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ ప్రతిపాదన ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ప్రాజెక్టు వ్యయం రూ.136 కోట్లు కాగా, కేంద్రం రూ.19.33కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 117.4 కోట్లు ఖర్చు చేయాల్సి




ఉంది. ఇప్పటి వరకు అలైన్‌మెంట్ ప్రణాళిక సిద్ధం కాలేదు.

ఆర్కేపురం-తిరుమలగిరి మార్గంలో ఆర్‌వోబీ విస్తరించాల్సి ఉంది. బ్రిడ్జికి సమీపంలోని బస్టాప్‌ను మరో చోటికి మార్చాలి. మూసివేసిన యూటర్న్ తెరవాలి.రైల్ నిలయం, తుకారాం గేట్ సమీపంలో ఆర్‌యూబీలను విస్తరించిన తరహాలో రాణిగంజ్ రైల్వే టన్నెల్ మార్గాన్ని చేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

చిలకలగూడ, మాణికేశ్వర్‌నగర్, విద్యానగర్, తిలక్‌నగర్, నింబోలి అడ్డా, కాచిగూడ, యాకుత్‌పురా, భవానీనగర్, లలితాబాగ్, జీఎం చావునీ, శివరాంపల్లి ప్రాంతాల్లో ఆర్‌యూబీలను విస్తరించాలి.

నాంపల్లి రైల్వేస్టేషన్, డీజీపీ కార్యాలయం, లక్డీకాపూల్, ఎంఎస్ మక్తా, కుందన్‌బాగ్, నేచర్‌క్యూర్ హాస్పిటల్, పాటిగడ్డ, చందానగర్, హఫీజ్‌పేట్, గాయత్రినగర్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, బాబానగర్, ఉప్పర్‌గూడ లెవెల్ క్రాసింగ్, మల్లాపూర్ సమీపంలోని ఎన్ఎఫ్‌సీ, చర్లపల్లి సమీపంలోని భరత్‌నగర్, గౌతంనగర్, సఫిల్‌గూడ లెవెల్ క్రాసింగ్, బొల్లారం, తుర్కపల్లి, బీహెచ్ఇఎల్ కాలనీ, కిష్టమ్మ ఎన్‌క్లేవ్, వెస్ట్ వెంకటాపురం, వాజ్‌పేయీనగర్ లెవెల్ క్రాసింగ్, కాకతీనగర్ లెవెల్ క్రాసింగ్, వినాయక్‌నగర్ లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ, ఆర్‌వోబీల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

# వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేనా..!

గోదావరిఖని: సింగరేణిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేందుకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఉత్పత్తి వేగవంతం చేసేందుకు మరింత కసరత్తు చేయాల్సి ఉంది. గనుల్లో పని స్థలాలు గుర్తించాలి. బొగ్గు పొరలను వెలికి తీసేందుకు నిరంతర పర్యవేక్షణ వేగం చేయాలి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా సింగరేణి నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఎనిమిది నెలలు గడచిపోయాయి. మిగిలిన నాలుగు నెలల్లో సాధించాల్సిన ఉత్పత్తిపై దృష్టి సారించాల్సి ఉంది. కార్మికులకు నాలుగు నెలల పాటు నగదు ప్రోత్సాహక పథకాన్ని అమలు చేయాలి. ఈ విషయమై ఇప్పటి వరకు యాజమాన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. నవంబరు నాటికి సింగరేణి 40 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది. మిగిలిన కాలంలో 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. నవంబరు నెలలో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించగా గడచిన ఏడు నెలల్లో తక్కువ శాతం ఉత్పత్తి సాధించడంతో వార్షిక లక్ష్యానికి దూరంగా ఉంది.

**నెలకు 8 మిలియన్ టన్నులు...**రానున్న రోజుల్లో నెలకు 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యానికి చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నెలకు 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ వస్తున్న సింగరేణి రానున్న కాలంలో 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు కేవలం అయిదు ఏరియాల్లో మాత్రమే వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. గత అక్టోబరులో 72 శాతం, అక్టోబరులో 91 శాతం, నవంబరులో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఇందులో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ప్రాంతాలు మాత్రమే వంద శాతానికి మించి ఉత్పత్తి చేశాయి.

**అందుబాటులోకి రాని కొత్త గనులు**

సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి కొత్త గనులు అందుబాటులోకి రాలేదు. ఈ ఏడాది ప్రణాళికలో ఉన్న నైనీ బొగ్గుబ్లాకుతో పాటు కొత్తగూడెం వీకే ఓసీపీ, ఇల్లెందు ప్రాంతంలోని రొంపేడు ఓసీపీ, రామగుండం మెగా ఓసీపీలు అందుబాటులోకి రాలేదు. ఈ కారణంగా వార్షిక బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

**ప్రోత్సాహక పథకంపై ఆశలు**సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం కార్మికులకు ఆర్థిక సంవత్సరంలో చివరి నాలుగు మాసాలు ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెడుతుంది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో హాజరుతో పాటు ఉత్పత్తి ఆధారంగా కార్మికులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. నాలుగు నెలల్లో గైర్హాజరు లేకుండా పనిచేసిన కార్మికులకు ప్రత్యేక ప్రోత్సాహకం, వ్యక్తిగతంగా, సామూహికంగా బొగ్గు ఉత్పత్తి సాధనలో అందించిన సహకారం. వంద శాతం ఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగుల పని విధానం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని వారికి ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల గుర్తింపు సంఘంతో నిర్వహించిన నిర్మాణాత్మక సమావేశంలో ఈ విషయాన్ని నాయకులు ప్రస్తావించారు. డివిజన్ల వారిగా ప్రోత్సాహక పథకాన్ని పరిగణలోకి తీసుకుని లక్ష్యాన్ని అధిగమించిన ఉద్యోగులకు వారి పని విధానం ఆధారంగా ప్రోత్సాహకాన్ని పంపిణీ చేస్తారు.



# ప్రధాని మోడీ పర్యటనకు చకచకా ఏర్పాట్లు.. విశాఖలో ఆంక్షలు..

విశాఖపట్నం : ఇంజనీరింగ్ గ్రౌండ్ కు 2 కిలోమీటర్ల పరిధిలో స్థానిక ప్రజలకు ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేశారు.. బయట నుండి వచ్చే వ్యక్తులపై నిఘా ఉంచనున్నారు పోలీసులు.. ఇక, నేడు, రేపు సభా పరిసర ప్రాంతాల్ల్ నో ప్రయివేట్ డ్రోన్ ఫ్లై విధించారు.. ఈ నేపథ్యంలో సభా ప్రాంగణంలో 5000 మంది పోలీసులు చేరుకుంటున్నారు%8ా% 35 మంది ఐపీఎస్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.. సిరిపురం దత్ ఐ ల్యాండ్ నుండి సభా ప్రాంగణం వరకు సుమారు 1.5 కిలో మీటర్ల రోడ్ షో జరగనుంది.. ఈ రోడ్ షో 45 నిముషాల పాటు కొనసాగనుంది. సభా ప్రాంగణం దగ్గరే కావడంతో ప్రజలకు అభివాధం చేస్తూ రోడ్ షో నెమ్మదిగా సాగనుంది.. రోడ్ షో లో మోడీతో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కలిసి పాల్గొనున్నారు.. ఉత్తరాంధ జిల్లాల నుండి సుమారు 3 లక్షల మంది ప్రజలు హాజరు అవుతారని అంచనా వేస్తున్నారు.. విశాఖలో రేపు ప్రధాని నరేంద్ర మోడీ సభకు, రోడ్ షో కు చక చకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. పూర్తి స్థాయిలో ఏర్పాట్లు లో నిమగ్నమయ్యారు అధికారులు.. మరో వైపు కూటమి నాయకులు వరుస సమీక్షలు నిర్వహిస్తు బిజీ బిజీగా కనిపిస్తున్నారు%8ా% రేపు సుమారు మూడు లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా ప్లానింగ్ చేస్తున్నారు.. ఉత్తరాంధ్ర జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి ప్రజల తరలింపుకు సుమారు 7000 వాహనాల కేటాయించారు.. సభకు హాజరయ్యే ప్రజల కోసం సుమారు 3 లక్షల ఆహార పొట్లాలు సిద్ధం చేయనున్నారు.. ప్రధాని టూర్ దృష్ట్యా రేపు ఉమ్మడి విశాఖలో పలు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించే అవకాశం కనిపిస్తుంది.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.. రూట్, రోప్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, డామినేషన్ టీమ్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాట్లు ట్రైల్ రన్స్ జరుగుతున్నాయి.. ఇక, ఏయూ గ్రౌండ్ లో ప్రధాని మోడీ సభ ఏర్పాట్లను పరిశీలించారు హోం మంత్రి వంగలపూడి అనిత. పోలీస్ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు.. ప్రధాని మోడీ రాక కోసం ఆంధ్రప్రదేశ్ ఎదురుచూస్తుందని.. ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో బల్క్ డ్రగ్ పార్క్ శంకస్థాపన చేస్తారు.. ప్రధాని మోడీ ప్రత్యేకమైన ధన్యవాలు తెలిపారు అనిత.. ప్రజలు ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.. 2019 నుండి 2024 వరకు పాయకరావుపేటలో ఒక్క కంపెనీ కూడా రాలేదు. ఇప్పుడు బల్స్ డ్రగ్ పార్క్, స్టీల్ ఫ్లాంట్ రాబోతున్నాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. పర్యావరణానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని వివరించారు వంగలపూడి అనిత..

# మోడల్ నియోజకవర్గంగా 'కుప్పం': సీఎం చంద్రబాబు



కుప్పం: మోడల్ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని ప్రాంతాలతో సమానంగా.. అవసరమైతే మిన్నగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కుప్పంలోని తెదేపా కార్యాలయంలో 'జననాయకుడు' పేరిట ఫిర్యాదుల స్వీకరణకు పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలు, విజ్ఞప్తులను సీఎం పరిశీలించారు. ప్రతి కౌంటర్ వద్దకు స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమస్యలు, ఫిర్యాదులు రిజిస్టర్ చేసేలా ఈ పోర్టల్‌లో ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. "ఫిర్యాదుల స్వీకరణకు 'జననాయకుడు' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రజలతో పాటు తెదేపా నేతలు, కార్యకర్తలు తమ ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేయవచ్చు. వాట్సప్ ద్వారా కూడా సమాచారం ఇవ్వొచ్చు. వాటిని పోర్టల్‌లో నమోదు చేసి విశ్లేషించి పరిష్కారం చూపుతాం. స్థానిక ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గం విషయంలో నాపై ప్రత్యేక బాధ్యత ఉంది. ఇక్కడి ప్రజలు వరుసగా 8 సార్లు గెలిపించారు. సీఎంగా ఉన్నందున అంచనాలు ఎక్కువగా ఉంటాయి. ఏ అర్జీ వచ్చినా నిర్దిష్ట సమయంలో పరిష్కార మార్గం చూపిస్తాం. ఇది వినూత్న ప్రయోగం" అని చంద్రబాబు అన్నారు.




## మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు బిగుస్తున్న ఉచ్చు.. సుప్రీం కీలక తీర్పు

ఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మరియమ్మ కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇవాళ(మంగళవారం) నందిగం సురేష్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మరియమ్మ హత్య కేసులో నందిగం సురేష్‌కు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. 2020లో తుళ్లూరు మండలం వెలగపూడికి చెందిన ఎస్సీ మహిళ మరియమ్మపై సురేష్ అనుచరులు దాడి చేశారు. తనకు వస్తున్న పెన్షన్‌ను నిలిపివేశారని, ఇళ్లు ఇస్తామని ఇవ్వలేదని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిను మరియమ్మ ధూషించింది. మరియమ్మ ఇంటిపై దాడి చేసి ఆమెను నందిగం సురేష్ అనుచరులు హతమార్చారు. ఈ విషయంపై అప్పట్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని ఆరోపణలు వచ్చాయి. 2020 నుంచి పోలీసులు విచారణ జరపకపోవడంతో దర్యాప్తు ముందుకు కదల్లేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి నారా లోకేష్‌ను మరియమ్మ కుమారుడు కలిసి తనకు న్యాయం చేయాలని కోరాడు. మరియమ్మ మృతి గురించిన వివరాలను, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును మరియమ్మ కుమారుడు తెలిపాడు. ఈ హత్య కేసులో సురేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆయన ఆశ్రయించాడు. కేసు తీవ్రత నేపథ్యంలో సురేష్‌కు ఏపీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో నందిగం సురేష్ సవాల్ చేశాడు. నందిగం సురేష్ బెయిల్ పిటీషన్‌పై ఈరోజు(మంగళవారం) జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. సురేష్ తన పాత కేసుల వివరాలను ఎందుకు దాచిపెట్టారని ప్రశ్నించింది. ట్రయల్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయకపోవడంతో తాము కూడా జోక్యం చేసుకోలేమని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసులో చార్జిషీటు కూడా దాఖలైనందున బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని నందిగం సురేష్ బెయిల్ పిటీషన్‌ను సుప్రీం ధర్మాసనం కొట్టివేసింది.

# నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ భూకంపం.. 95కు చేరిన మృతులు

హిమాలయ దేశాలు నేపాల్–టిబెట్ సరిహద్దులను భారీ భూకంపం వణికించింది. మంగళవారం ఉదయం ఇక్కడ 6.8 తీవ్రతతో సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తు కారణంగా టిబెట్‌లో ఇప్పటివరకు కనీసం 95 మంది మరణించినట్లు తెలుస్తోంది. ఈమేరకు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. మరో 130 మంది గాయపడినట్లు తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. నేపాల్–టిబెట్ సరిహద్దుకు 93 కిలోమీటర్ల దూరంలో ఉన్న లబుచె ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.35 గంటలకు ఈ భూకంపం సంభవించింది. టిబెట్‌లోని షిజాంగ్‌లో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు నేపాల్ అధికారులు వెల్లడించారు. కొన్ని క్షణాల పాటు తీవ్రస్థాయిలో ప్రకంపనలు రావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం తర్వాత టిబెట్ రీజియన్‌లో మరో రెండుసార్లు ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వీటి తీవ్రత 4.7, 4.9గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రం ఉన్న టిబెట్ ప్రాంతంలో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద



పలువురు చిక్కుకున్నట్లు సమాచారం.

**భారత్‌లోనూ ప్రకంపనలు..** ఈ ప్రకంపనల ప్రభావం భారత్‌లోని ఉత్తరాది రాష్ట్రాలపైనా కనిపించింది. దిల్లీ–ఎన్‌సీఆర్, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు సమాచారం. అటు చైనా, భూటాన్, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ ప్రకంపనలు సంభవించాయి.




# సంక్రాంతికి 7200 ప్రత్యేక బస్సులు

అమరావతి : సంక్రాంతిపండగ దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) నిర్ణయించింది. తెలంగాణ సహా ఇతర రాష్ట్రాలకు బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆర్టీసీ ఎండీ ప్రకటించారు.

జనవరి 8 నుంచి మొదలు 13 వరకూ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి పలుచోట్లకు 2,153 బస్సులు, బెంగళూరు నుంచి 375, విజయవాడ నుంచి 300 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. తిరుగు ప్రయాణానికి ఈ నెల 16 నుంచి 20 వరకు 3,2 00 ప్రత్యేక బస్సులను నడపనున్నామని ఎండీ పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలుండవని, సాధారణ ఛార్జీలనే వసూలు చేస్తామన్నారు. ఒకేసారి రెండు వైపులా టికెట్లు బుక్ చేసుకుంటే టికెట్ ధరపై 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆర్టీసీ ఎండీ తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయా ణం చేయాలని.. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



# మైక్రోసాఫ్ట్ 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి: సీఈఓ సత్యనాదెళ్ల

బెంగళూరు: ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. దేశంలో క్లౌడ్, కృత్రిమ మేధ సామర్థ్యాలను విస్తరించడం, డేటా సెంటర్ల విస్తరణ కోసం 3 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడించారు. అలాగే, 2030 నాటికి 10 మిలియన్ల మందికి (కోటి మందికి) ఏఐ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బెంగళూరు వేదికగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. ప్రస్తుతం భారత్ పర్యటనలో ఉన్న సత్య నాదెళ్ల సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఏఐ విషయంలో భారత్‌ను ఉన్నత స్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో బెంగళూరులో జరిగిన ఈవెంట్‌లో పెట్టుబడులపై ప్రకటన చేశారు. ఎప్పుడూ లేని స్థాయిలో భారత్‌లో 3 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నందుకు సంతోషంగా ఉందని సత్య నాదెళ్ల తెలిపారు. ఈ పెట్టుబడి భారత్‌లో ఏఐ ఆవిష్కరణలకు ఊతం ఇస్తుందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న ప్రధాని మోదీ ఆలోచనల్లో కీలక భూమిక పోషిస్తుందన్నారు. భవిష్యత్‌లో ఏఐ నిపుణుల అవసరం పెద్ద సంఖ్యలో ఏర్పడుతుందని సత్య నాదెళ్ల అన్నారు. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడంలో భారతీయ నిపుణులు ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. లింక్డిన్‌లో ఏఐ స్కిల్స్‌ను తమ ప్రొఫైల్‌కు జోడించిన వారి సంఖ్య గ్లోబల్‌గా 71 శాతంగా ఉండగా.. భారత్‌లో 122 శాతం వృద్ధి నమోదైందన్నారు. అందుకే 2025 నాటికి 2 మిలియన్ల మందిని ఏఐ నిపుణులుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో గతంలో 'అడ్వాంటేజ్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. నిర్దేశిత గడువు కంటే ముందే ఆ లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. అదే కార్యక్రమం కింద 2030 నాటికి 10 మలియన్ల మందికి ఏఐ స్కిల్స్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సత్యనాదెళ్ల తెలిపారు.

# ఆ ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించండి.. మంత్రి దుర్గేశ ఆదేశాలు...



అమరావతి: విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో త్వరలోనే పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో మంత్రి దుర్గేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల విజయవాడ వివంత హోటల్‌లో నిర్వహించిన ఇన్వెస్టర్ల సమ్మిట్ చర్చకు వచ్చింది. దీంతో ఆ సమ్మిట్‌లో వచ్చిన ప్రతిపాదనలపై అధికారులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలను పరిశీలించి త్వరగా వాటిని పట్టాలెక్కించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అలాగే పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనుల ప్రగతిపైనా మంత్రి సమీక్షించారు. పనులకు సంబంధించిన పలు వివరాలను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. త్వరలోనే ఆయా పర్యాటక ప్రాంతాల్లో పర్యటిస్తానని, తానే స్వయంగా పర్యాటకాభివృద్ధి పనులు పర్యవేక్షిస్తానని మంత్రి చెప్పారు.

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు విశేష ప్రాచుర్యం కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఏపీలో ఉన్న అద్భుతమైన పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే పెద్దఎత్తున వాటిని సందర్శించే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. తద్వారా పర్యాటకశాఖకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అలాగే ప్రజలకు కూడా మన చరిత్ర గురించే తెలిసే అవకాశం ఉంటుందని దుర్గేశ్ చెప్పుకొచ్చారు. అనంతరం మంత్రి దుర్గేశ్‌తో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురూ సినిమాటోగ్రఫీ శాఖపై విస్తృతంగా చర్చించారు.

# ఆరోగ్య శ్రీ పెండింగ్ బకాయిలు చెల్లించాలి



విజయవాడ: పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఆరోగ్య శ్రీ...దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానస పుత్రిక ఈ పథకం అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ప్రాణాలు తీసే జబ్బు వచ్చినా ఆదుకునే సంజీవని లాంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని.. కూటమి సర్కార్ అనారోగ్యశ్రీగా మార్చిందని ఆరోపించారు. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్) వేదికగా షర్మిల ట్వీట్ చేశారు. రూ. 3వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా, వైద్యసేవలు నిలిచే దాకా చూడటమంటే ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రనే అని వైఎస్ షర్మిల విమర్శించారు. ఆరోగ్య శ్రీ పథకానికి మంగళం పాడి.. ప్రజల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని చెప్పారు. ఆరోగ్యానికి పెద్దపీట అంటూనే కోతలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ.. వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆరోగ్య శ్రీని ఏపీలో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఆరోగ్య శ్రీ పథకానికి బకాయిలను జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని..వాటిని చెల్లించే బాధ్యత కూటమి ప్రభుత్వంపైనే ఉందని చెప్పారు. వెంటనే ఆస్పత్రుల యాజమాన్యాలను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు రూ. 3వేల కోట్లు తక్షణం విడుదల చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ సేవలను వెంటనే పునరుద్ధరించి, పథకానికి ఏ లోటూ రాకుండా చూడాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# హైకోర్టులో మాజీ మంత్రి పేర్నినానికి స్వల్ప ఊరట



అమరావతి, జనవరి 7: ఏపీలో సంచలనం సృష్టించిన బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానికి హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి పేర్నినాని వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. తదుపరి విచారణను ఈనెల (జనవరి) 20కి ధర్మాసనం వాయిదా వేసింది. అప్పటి వరకు తొందరపాటు చర్యలు వద్దని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రేషన్ బియ్యం అమ్ముకున్న ఘటనలో ఏ6గా పేర్నినాని ఉండగా, ఏ1గా పేర్నినాని సతీమణి జయసుధ ఉన్నారు. గోడౌన్ మొత్తం కూడా జయసుధ పేరుమీద ఉండటంతో మొదటి నుంచి ఈ కేసులో జయసుధ ఉన్నారు. అయితే ఏ6గా పేర్నినాని చేర్చారు పోలీసులు. ఈ విషయం తెలిసిన వెంటనే పేర్నినాని హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. నిన్న ఈ కేసుపై విచారణ జరుగగా.. నేటికి వాయిదా వేసింది హైకోర్టు. ఈరోజు మరోసారి పేర్నినాని పిటిషన్‌పై హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇరువురి వాదనలు విన్న న్యాయస్థానం.. జనవరి 20 (సోమవారం) వరకు ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# పార్వతిదేవిగా చందమామ


చందమామ బ్యూటీ కాజల్ అగర్వాల్ ఈ మధ్య కాలంలో సినిమాల్లో కాస్త వెనుక పడింది అంటూ ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాల పాటు టాలీవుడ్‌లో ఓ రేంజ్‌లో సినిమాలు చేసి సీనియర్, జూనియర్, స్టార్, సూపర్ స్టార్, కొత్త హీరోలు ఇలా అందరితోనూ సినిమాలు చేసిన కాజల్ అగర్వాల్ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. పెళ్లి అయ్యి తల్లి అయిన తర్వాత కాజల్ అగర్వాల్ మునుపటి మాదిరిగా సినిమాలు చేయాలని భావించినా సాధ్యం కావడం లేదు. ఆమెకు కోరుకున్న ఆఫర్లు దక్కడం లేదు. అందుకే ఆమె మెల్లగా వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకునే ఉద్దేశ్యంతో సినిమాలు చేస్తూ వస్తుంది. గెస్ట్ అప్పియరెన్స్, ముఖ్య పాత్రలకు కాజల్ అగర్వాల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. అందులో భాగంగానే మంచు విష్ణు హీరోగా రూపొందుతున్న కన్నప్ప సినిమాలో కీలకమైన పార్వతీదేవి పాత్రలో నటించింది. శివుని భక్తుడి సినిమా అయిన కన్నప్పలో పార్వతి దేవికి ఏ స్థాయి పాత్ర ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కనుక ఆమె కనిపించేది కొద్ది సమయం అయినా కథలో కీలకం అయ్యి ఉంటుంది. అంతే కాకుండా ఆమె కనిపించే సీన్స్ సినిమాకు అత్యంత కీలకంగా ఉంటాయనే అభిప్రాయం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. కాజల్ అగర్వాల్ కన్నప్ప సినిమాలో నటిస్తున్నట్లుగా మేము గతంలోనే చెప్పుకొచ్చాము. కన్నప్ప కోసం



కాజల్ అగర్వాల్ చాలా రోజుల క్రితమే షూటింగ్‌ను ముగించింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో మెల్ల మెల్లగా చిత్ర యూనిట్ సభ్యులు సినిమాలో నటించిన వారిని పరిచయం చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే కొన్ని రోజుల క్రితం మోహన్‌లాల్ లుక్‌ను రివీల్ చేసిన మేకర్స్ ఇప్పుడు చందమామ బ్యూటీ కాజల్ అగర్వాల్ లుక్‌ను రివీల్ చేయడం జరిగింది. ఈ మధ్య కాలంలో కాజల్ అగర్వాల్ లేబా ఓరియంటెడ్ సినిమాలు చేస్తూ వస్తున్న విషయం తెల్సిందే. ఇలాంటి సమయంలో కన్నప్ప వంటి సినిమాలో ముఖ్య పాత్రలో కాజల్ నటించడం ద్వారా కచ్చితంగా ఆమె కెరీర్‌కి కీలకం అనడంలో సందేహం లేదు. పార్వతి దేవి గా గతంలో నటించిన వారు ఎంతో మంది మంచి పేరు సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా సీరియల్స్‌లో పార్వతి దేవి పాత్రలో నటించిన వారు హీరోయిన్గా నిలిచారు. అందుకే కాజల్ అగర్వాల్ ను హీరోయిన్‌గా చూడటం ద్వారా ముందు ముందు ఆమెను మరిన్ని మంచి పెద్ద సినిమాల్లో చూసే అవకాశం వస్తుంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కన్నప్ప ఈ ఏడాది ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ప్రభాస్‌తో పాటు పలువురు స్టార్స్ ఈ సినిమాలో కనిపించబోతున్నారు. ముకేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను మంచు విష్ణు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. మోహన్ బాబు ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించడంతో పాటు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

## ఈయన వయసు 73 ఏళ్లా...? 37 ఏళ్లా..?

1980 నుంచి మలయాళ సినిమా ఇండస్ట్రీలో హీరోగా కొనసాగుతున్న స్టార్ మమ్ముట్టి. ఇండియన్ సినీ స్టార్స్‌లో మోస్ట్ సీనియర్ స్టార్‌గా గుర్తింపు దక్కించుకున్న మమ్ముట్టీ ఇప్పటికీ వరుసగా సినిమాలు చేస్తున్నారు. ఏడాదికి కనీసం రెండు మూడు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్న ఈయన వారసులు ఇండస్ట్రీలో దూసుకుపోతున్నారు. మమ్ముట్టీ తనయుడు దుల్కర్ సల్మాన్ పాన్ ఇండియా స్థాయిలో వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతున్న విషయం తెల్సిందే. దుల్కర్ సల్మాన్‌కి ఏమాత్రం తక్కువ కాకుండా మమ్ముట్టీ సినిమాల జోరు జాతర కొనసాగుతోంది. మమ్ముటీ తాజాగా ఈ ఫోటోతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నారు. మధ్య కాలంలో మమ్ముట్టీ కాస్త వయసు ఎక్కువ ఉన్న పాత్రల్లో కనిపిస్తున్నారు. కానీ హఠాత్తుగా ఈ ఫోటోలో చూడగానే చాలా మంది షాక్ అయ్యారు.



మమ్ముట్టీ వయసు 73 ఏళ్లు అని గూగుల్‌లో చూపిస్తుంది. కానీ ఈ ఫోటోలో చూస్తే ఆయన వయసు 37లా ఉంది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఆ వయసులో సాధారణంగా ఎక్కువ శాతం మంది కనీసం లేవడానికి కూడా ఇబ్బంది పడతారు. అలాంటిది మమ్ముట్టీ మాత్రం మూడు పదుల వయసు లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. అంతే కాకుండా మూడు పదుల వయసులో ఉన్న హీరోలు ఎంత ఉత్సాహంతో సినిమాలు చేస్తారో అదే ఉత్సాహంతో సినిమాలు చేయడంను చాలా మంది ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి నాలుగు దశాబ్దాలు దాటినా ఏ మాత్రం జోరు తగ్గలేదు. ఈ స్థాయిలో సినిమాలు చేయడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. చిరంజీవితో పాటు ఇతర సీనియర్ స్టార్ హీరోలు సైతం మమ్ముట్టీ కంటే జూనియర్స్ అనే విషయం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉంది. మమ్ముట్టీ ఈ వయసులోనూ ఇంత గుడ్ లుకింగ్‌గా, ఫిట్‌గా ఉండటంను ఆదర్శంగా తీసుకుని యంగ్ హీరోలు ఇప్పటి నుంచి మంచి అలవాట్లను అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలుగులోనూ మమ్ముట్టీకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆయన నటించిన ఎన్నో సినిమాలు తెలుగులో విడుదల అయ్యాయి. డబ్బింగ్ సినిమాలతోనే కాకుండా కొన్ని డైరెక్ట్ సినిమాలతోనూ మమ్ముట్టీ తెలుగు ప్రేక్షకులను పలకరించారు. 1992లో స్వాతి కిరణం సినిమాలో మమ్ముట్టి నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. 20219లో యాత్ర, 2024లో యాత్ర 2 సినిమాలు విడుదల అయ్యి రాజశేఖర్ రెడ్డిగా తెలుగు ప్రేక్షకులను అలరించారు. మమ్ముట్టీ కి ఇంకా ఎన్నో తెలుగు సినిమా ఆఫర్లు వచ్చాయి. కానీ ఆయన మాత్రం చాలా అరుదుగా మాత్రమే తెలుగు సినిమాలు చేశారు. ఆయన నుంచి ముందు ముందు తెలుగు సినిమాలు వస్తాయా అనేది చూడాలి.




# 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్.. వెంకీమామ పర్ఫెక్ట్ పండగ సినిమా..!




విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తోన్న హ్యాట్రిక్ మూవీ "సంక్రాంతికి వస్తున్నాం". దిల్ రాజు ప్రొడక్షన్ లో రూపొందిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే రిలీజ్ చేసిన ప్రమోషనల కంటెంట్ కు అనూహ్య స్పందన లభించింది. ఇప్పటివరకు విడుదలైన మూడు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఈ మధ్య కాలంలో ఎక్కడ చూసినా ఈ పాటలే వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రమోషన్స్ లో భాగంగా సోమవారం సాయంత్రం థియేట్రికల్ ట్రైలర్ ను ఆవిష్కరించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు సోషల్ మీడియా వేదికగా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసి చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ అందజేశారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ 'ఎక్స్' లో పోస్ట్ చేస్తూ "చూస్తుంటే ఖచ్చితంగా హిట్ అయ్యేలా ఉంది. మా పెద్దోడు వెంకటేష్, నా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలిసి చేసిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. మీ ఇద్దరికీ హ్యాట్రిక్ విజయం సాధించాలని, మొత్తం టీంకు ఈ సంక్రాంతి మెమరబుల్ గా ఉండాలని కోరుకుంటున్నాను. జనవరి 14న సినిమా కోసం ఎదురు చూస్తున్నాను" అని పేర్కొన్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లోకి వెళ్తే, కథంతా అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి శ్రీనివాస్ అవసరాల కిడ్నాప్ చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఈ విషయం బయటకు తెలిస్తే అర నిమిషంలో ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం ఉందని అంటున్న నరేష్ వీకే.. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి, ప్రభుత్వం కోసం పనిచేసేవాడు ఒక్కడు కావాలి అని అంటుండగా, ఎక్స్ కాప్ గా వెంకటేష్ ను చూపించారు. పర్ఫెక్ట్ ఫ్యామిలీ మ్యాన్ అయిన వెంకీ తన ఎక్స్ లెంట్ వైఫ్ (ఐశ్వర్య రాజేష్) తో ఆనందకరమైన జీవితాన్ని గడుపుతున్నాడు. అయితే తమ అన్యోన్యమైన దాంపత్యానికి దృష్టి పెట్టేవారే లేరని అనుకుంటుండగా.. వారి లైఫ్ లోకి వెంకటేష్ ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ప్రస్తుతం పోలీసుగా ఉన్న మీను (మీనాక్షి చౌదరి) ఎంట్రీ ఇచ్చింది. కిడ్నాప్ కేసును పరిష్కరించడంలో సహాయం కోరుతూ వెంకీ ఫ్యామిలీకి మీనాక్షి ఎంటర్ అయిన తర్వాత, వారి ప్రశాంతమైన జీవితం చెదిరిపోతుంది. మీ ఆయన మీద ఎలాంటి ఫీలింగ్ లేదని మీను చెప్పినా, భాగ్యం మనసులో ఎక్కడో చిన్న అనుమానం మొదలవుతుంది. అందుకే ఈ ఆపరేషన్ లో తన భర్తతో పాటుగా వెళ్లాలని భాగ్యం నిర్ణయించుకుంది. ఎక్స్ కాప్, ఎక్స్ లెంట్ వైఫ్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ కలిసి మిషన్ చేపట్టిన తర్వాత అసలైన ఛాలెంజ్ ఎదురైనట్లు ట్రైలర్ లో చూపించారు. అక్కడి నుంచి ఈ ట్రయాంగిల్ క్రైమ్ స్టోరీ ఆద్యంతం ఆసక్తికరంగా ఆకట్టునేలా సాగింది. టాలీవుడ్ లో అపజయం ఎరుగని దర్శకుడుగా పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి.. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో సరికొత్త జోనర్ లో తనకు కలిసొచ్చిన కామెడీని పండించే ప్రయత్నం చేసారు. ఒక రెగ్యులర్ ఎంటర్‌టైనర్ లా కాకుండా, ఈసారి పూర్తి భిన్నమైన ఫ్రెష్ కంటెంట్ తో వస్తున్నారని హింట్ ఇచ్చారు. ట్రైలర్‌లో సూచించినట్లుగా సినిమాలో ఎన్నో ట్విస్టులు, థ్రిల్స్, యాక్షన్, డ్రామా ఉండబోతున్నాయని తెలుస్తోంది. వెంకటేష్ ఎప్పటిలాగే తనకు అలవాటైన పాత్రలో అద్భుతమైన నటన కనబరిచారు. కామెడీ, ఫ్యామిలీ డైనమిక్స్, హై-ఆక్టేన్ యాక్షన్ సీన్స్ లో అవలీలగా నటించారు. ముఖ్యంగా భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగిపోయే సన్నివేశాలు కడుపుబ్బా నవ్విస్తాయి. "ప్రతి సినిమా రిలీజ్ కు ముందు ఒక టీజర్ ఉన్నట్లు, ప్రతీ మగాడికి పెళ్ళికి ముందు ఒక లవర్ ఉంటుంది. ఇట్స్ నేచురల్" అని వెంకీ చెప్పే డైలాగ్, చివర్లో దయచేసి పెళ్ళాలకు ఫ్లాష్ బ్యాక్ లో లవ్ స్టోరీని చెప్పకండి అంటూ తనదైన శైలిలో ఏడుస్తూ చెప్పే సీన్ హైలెట్ గా నిలిచాయి. ఇక ఆదర్శవంతమైన భార్యగా, కాస్త ఇన్నోసెంట్ హౌస్ వైఫ్ పాత్రలో ఐశ్వర్య రాజేష్ ఆకట్టుకుంది. వెంకటేష్ మాజీ ప్రియురాలుగా, దృఢనిశ్చయం కలిగిన పోలీసుగా మీనాక్షి చౌదరి కనిపించింది. ట్రైలర్ కు కాస్త గ్లామర్ ను జోడించింది. 'ప్రెస్ మీట్ పెట్టి పెంట పెంట చేస్తా' 'హిస్టరీలో వీడు ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ తో వచ్చిన ప్రతీసారి విక్టరీ' అంటూ 'యానిమల్' ఫేమ్ ఉపేంద్ర లిమాయే తన సొంత వాయిస్ తో చెప్పిన డైలాగ్స్ అలరిస్తాయి. వీటీ గణేష్, సాయి కుమార్, పృథ్వీరాజ్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి తదితరులు ఇతర పాత్రల్లో కనిపించారు.

# 'గేమ్ ఛేంజర్' ట్రైలర్‌కి ఆల్‌టైమ్ రికార్డ్




రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' సినిమా అంచనాలు పెంచుతూ తాజాగా ట్రైలర్ వచ్చేసింది. టాలీవుడ్ జక్కన్న రాజమౌళి విడుదల చేసిన ఈ ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. రికార్డ్ స్థాయి వ్యూస్‌ను రాబడుతూ యూట్యూబ్‌తోనూ అన్ని ప్లాట్ ఫామ్స్‌లోనూ దూసుకు పోతుంది. అన్ని భాషల్లోనూ యూట్యూబ్ ద్వారా ఇతర ప్లాట్‌ఫామ్స్ ద్వారా గేమ్ ఛేంజర్ ట్రైలర్ విడుదలైన విషయం తెల్సిందే. చిత్ర యూనిట్ సభ్యులు ఈ సినిమా ట్రైలర్ ఆల్ టైమ్ రికార్డ్‌ను సొంతం చేసుకుందని, వ్యూస్, లైక్స్ తో కుమ్మేస్తుంది అంటూ నెట్టింట అధికారికంగా ప్రకటించారు.

గేమ్ ఛేంజర్ సినిమా ఏకంగా 180 మిలియన్‌ల వ్యూస్‌తో ఆల్ టైమ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది అంటూ మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈమధ్య కాలంలో ఈ స్థాయిలో ఏ సినిమా ట్రైలర్‌కి ఈ స్థాయిలో వ్యూస్ రాలేదు అంటూ మేకర్స్ నుంచి ప్రకటన వచ్చింది. సినిమాకు ఉన్న బజ్ నేపథ్యంలో ఈ స్థాయిలో అత్యధిక వ్యూస్ వస్తున్నాయి. పైగా ట్రైలర్ కట్ బాగుండటం మాత్రమే కాకుండా బీజీఎంతో తమన్ అలరించాడు. అందుకే ఈ సినిమా ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తుంది అంటూ మెగా ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గేమ్ ఛేంజర్‌లో రెండు పాత్రల్లోనూ రామ్ చరణ్ లుక్‌కి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ట్రైలర్‌లోని రామ్ చరణ్ మాస్ లుక్, ముఖ్యంగా లుంగీ కట్టిన షాట్స్‌ను స్లో మోషన్‌లో చూసి మరీ ఎంజాయ్ చేస్తున్నారు. సినిమాలో రామ్ చరణ్ ఏ స్థాయి పవర్ ఫుల్‌గా ఉంటాడు అనేది చూపిస్తూనే మంచి మెసేజ్‌ను ఈ సినిమాలో చూపించబోతున్నారు. రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా ఈ సినిమాలో నటించారు. అంజలి ఈ సినిమాలో తండ్రి పాత్రలో కనిపించిన చరణ్‌కి జోడీగా నటించింది. తమిళ స్టార్ దర్శకుడు కమ్ నటుడు అయిన ఎస్ జే సూర్య ఈ సినిమాలో మెయిన్ విలన్‌గా నటించడం ద్వారా అంచనాలు మరింతగా పెరిగాయి. శంకర్ వింటేజ్ మూవీ అంటూ గేమ్ ఛేంజర్ గురించి ఆసక్తికర ప్రచారం జరుగుతోంది. రామ్ చరణ్ ఆర్‌ఆర్‌ఆర్, ఆచార్య సినిమాల తర్వాత రాబోతున్న సినిమా ఇదే అనే విషయం తెల్సిందే. నాలుగు ఏళ్ల క్రితం చరణ్ సోలో హీరోగా వినయ విధేయ రామ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అందుకే సోలో హీరోగా చరణ్‌కి హిట్ లేక చాలా కాలం అయ్యింది. అందుకే ఈ సినిమాతో తన సత్తా ను చాటే విధంగా రామ్ చరణ్ దుమ్ము లేపడం ఖాయం అంటూ ఫ్యాన్స్‌తో పాటు ప్రతి ఒక్కరూ నమ్మకంగా ఉన్నారు. రామ్ చరణ్, శంకర్ కాంబోలో రూపొందిన ఈ భారీ బడ్జెట్ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 10వ తారీకున ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# కియారా అవసరం లేదని ముందే డిసైడ్ అయ్యారా!

గేమ్ ఛేంజర్ ప్రచార కార్యక్రమాల్లో హీరోయిన్ కియారా అద్వాణీ ఎక్కడా కనిపించని సంగతి తెలిసిందే. అమెరికాలో నిర్వహించిన ఈవెంట్ లో లేదు. నిన్నటి రోజున రాజమండ్రిలో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లోనూ ప్రత్యక్షమైంది లేదు. మరి కియారా ఎందుకు ఇలా చేస్తుంది? అంటే అమ్మడి తప్పు ఎక్కడా లేనట్లే ఉంది. మేకర్సే కియారాని తన పనులు చూసుకోమని చెప్పినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఓ స్టార్ హీరో సరసన హీరోయిన్ నటిచందంటే రిలీజ్ వరకూ తప్పక అన్ని ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలి. ప్రీ రిలీజ్ ఈవెంట్, ప్రెస్ మీట్, ఇంటర్వ్యూలు ఇలా ఎన్ని వీలైతే అన్నింటా తప్పక హాజరు అవ్వాల్సిందే. కాదు కూడదు అంటూ మేకర్స్ ఒప్పుకోరు. ఈ విషయంలో కేవలం నయనతార మాట మాత్రమే చెల్లుతుంది. మిగతా ఏ హీరోయిన్ మాట మేకర్స్ వినరు. అయితే ఇక్కడ కియారా పరిస్థితి వేరు. గేమ్ ఛేంజర్ ప్రచారం కోసం రామ్ చరణ్-శంకర్ ఉంటే చాలు అనుకున్నారు. అందుకే అమెరికా ఈవెంట్ లో వీళ్లిద్దరితో పాటు సుకుమార్ , బుచ్చిబాబు వచ్చారు.



ఆ నలుగురితో ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయింది. ఇక రాజమండ్రి ఈవెంట్ లో ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చీఫ్ గెస్ట్ గాహాజరయ్యారు. వాళ్ల పక్కనే శంకర్, రామ్ చరణ్ ఉన్నారు. ఈ ముగ్గురు ఒకే వేదికపై ఉంటే హీరోయిన్ తో పనే ముంది అందుకే ఇక్కడ కూడా కియారా కనిపించలేదు. కోట్ల పబ్లిసిటీ ఆ ముగ్గురి రూపంలోనే దక్కుతుంది. మళ్లీ కియారాని తీసుకురావాలంటే? స్పెషల్ ఫ్లైట్ వేయాలి. స్టార్ హొటల్ లో రూమ్ బుక్ చేయాలి. అదనంగా పారితోషికం డిమాండ్ చేస్తే చెల్లించాలి. ఈ కథ అంతా ఎందుకని రాజుగారు అనుకున్నారో? ఏమో! ప్రచారం విషయంలో కియారాని పూర్తిగా పక్కన బెట్టేసారు. సినిమా రిలీజ్ కి మరో ఐదు రోజులు సమయం ఉంది. మరి ఈ గ్యాప్ లో కియారా ఇంటర్వ్యూలు ఏవైనా ప్లాన్ చేస్తున్నారా? అన్నది తెలియాలి.

## అంజలి కెరీర్‌కి ఇది ప్లస్సా మైనస్సా?

కెరీర్ ప్రారంభంలో కంటెంట్ ఉన్న అనువాద సినిమాలతో మెప్పించింది తెలుగమ్మాయి అంజలి. తమిళంలో పెద్ద నటిగా నిరూపించి తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టింది. షాపింగ్ మాల్, జర్నీ లాంటి రియలిస్టిక్ ఎప్రోచ్ ఉన్న సినిమాలతో తమిళంలో హిట్లు కొట్టి వాటి అనువాదాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ఆ సినిమాల్లో అంజలి నటనకు మంచి అభిమానులేర్పడ్డారు. ఆ తర్వాత సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు లాంటి పెద్ద సినిమాలో డీసెంట్ పాత్రలో నటించి మెప్పించింది. గీతాంజలి లాంటి నాయికా ప్రధాన చిత్రంతోను అంజలి నటనకు మంచి పేరొచ్చింది. కానీ ఈ సినిమా సీక్వెల్ గీతాంజలి మళ్లీ వచ్చింది ఆశించిన ఫలితాన్నివ్వలేదు. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరిలో బోల్డ్ పాత్రలో నటించినా అది కూడా కలిసి రాలేదు. ఇప్పుడు శంకర్ దర్శకత్వంలోని గేమ్ ఛేంజర్‌పైనే అంజలి చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సినిమా తన ఫేట్ మారుస్తుందని భావిస్తోంది. సినిమాలో రామ్ చరణ్ తండ్రి పాత్ర ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ లో అంజలి



కనిపిస్తుంది. ఐఏఎస్ అధికారికి తండ్రి అయిన అప్పన్న (చరణ్) కు భార్యగా అంజలి కనిపిస్తుంది. ప్రస్తుత పొలిటికల్ సిస్టమ్ తో పోరాడే సిన్సియర్ ఐఏఎస్ అధికారి తల్లిగా అంజలి నటించింది. ఒక భార్యగా, తల్లిగా నటించేందుకు స్కోప్ ఉన్న పాత్రలో అవకాశం దక్కిందని అంజలి ఉబ్బితబ్బిబ్బవుతోంది. శంకర్ లాంటి పెద్ద దర్శకుడు తన కెరీర్ గేమ్ ని ఛేంజ్ చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తోంది. అయితే చియాన్ విక్రమ్ అపరిచితుడు సినిమాలో నటించేప్పుడు సదా కెరీర్ రేంజ్ అమాంతం మారిపోతుందని అంతా భావించారు. ఆ చిత్రంలో సదా పాత్రను శంకర్ బాగానే ఎలివేట్ చేసారు.. కానీ ఆ తర్వాత అనుకున్నదేమీ జరగలేదు. ఇప్పుడు అంజలికి అలా కాకూడదనే అభిమానులు ఆశిస్తున్నారు. గేమ్ ఛేంజర్ సినిమాలో కియరా అద్వాణీ గ్లామరస్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే.

**డబుల్ ధమాకా! :** ఆసక్తికరంగా ఈ సంక్రాంతి బరిలో అంజలి నటించిన రెండు సినిమాలు ఒకదానితో ఒకటి పోటీపడుతున్నాయి. తమిళంలో విశాల్ - అంజలి నటించిన మదగజరాజా దాదాపు 13 ఏళ్ల తరవాత విడుదలవుతోంది. ఈ సినిమా సడెన్ గా సంక్రాంతి బరిలోకి వచ్చింది. అయితే విశాల్ లాంటి మాస్ హీరో సినిమా కాబట్టి దీనిపై కొంత ఆసక్తి నెలకొంది. గేమ్ ఛేంజర్ ఇతర తమిళ సినిమాలతోను సంక్రాంతి బరిలో పోటీపడనుంది. తళా అజిత్ విదాముయార్చి వాయిదా పడటంతో గేమ్ ఛేంజర్ కి, ఇతర సినిమాలకు అడ్వాంటేజ్ గా మారింది.



# కర్రలతో కొట్టుకున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ మాజీ ఎంపీ రమేష్ బిదురి ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. దీంతో బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ నాయకులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ కార్యాలయంపై కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేశారు. దీంతో బీజేపీ నాయకులు కాంగ్రెస్ శ్రేణులపై తిరగబడటంతో కర్రలతో రెండు పార్టీల నాయకులు కొట్టుకున్నారు. ఈ దాడిలో బీజేపీ కార్యకర్త తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఢిల్లీకి చెందిన బీజేపీ నేత రమేష్ బిదురి ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీలో రోడ్లను ప్రియాంక గాంధీ బుగ్గలలా తయారుచేస్తామన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. మరోవైపు ఆప్ నేత అతిషిపై కూడా రమేష్ బిదురి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణలు చెప్పారు. తాను అలా అని ఉండాల్సింది కాదన్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు.

# కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తారు: హరీశ్ రావు



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇలాంటి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తాము భయపడేది లేదన్నారు. ఫార్ములా ఈ–రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

**9న ఏసీబీ విచారణకు కేటీఆర్ వెళ్తారు...** "ఫార్ములా రేసింగ్ ద్వారా రాష్ట్ర ప్రతిష్ఠ పెంచాలని కేటీఆర్ ప్రయత్నించారు. రేసింగ్ మా రాష్ట్రంలో నిర్వహించాలంటూ చాలా రాష్ట్రాలు అడిగాయి. ఆ రేసింగ్‌తో రాష్ట్రానికి ఆదాయం వచ్చింది తప్ప.. ఆయన తన సొంత ప్రయోజనాల కోసం ఏమీ చేయలేదు. గ్రీన్ కంపెనీ రాష్ట్రంలో ఎలాంటి కాంట్రాక్టులు పొందలేదు. ఆ సంస్థకు గత ప్రభుత్వం తరఫున ఎలాంటి లబ్ధి జరగలేదు. హైకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. కేటీఆర్ దోషిగా తేలి శిక్ష పడినట్లు ప్రచారం చేస్తున్నారు. ఈ కేసులో తప్పు జరిగిందని చెప్పి కోర్టు శిక్ష ఏమీ వేయలేదు. విచారణ చేయవచ్చని మాత్రమే హైకోర్టు చెప్పింది. న్యాయస్థానాలపై మాకు గౌరవం ఉంది. విచారణకు సహకరిస్తాం. ఇప్పటికే విచారణ కోసం కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి కూడా వెళ్లారు. ఈ నెల 9న విచారణకు హాజరవుతారు.

**బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడేది లేదు...** కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ప్రజల దృష్టి మరల్చారని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోంది. రైతు భరోసాను రూ.15వేల నుంచి రూ.12వేలకు తగ్గించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే ఆయనపై కేసులు పెడుతున్నారు. ఇంకా చాలా మంది నేతలపై రేవంత్ రెడ్డి కేసులు పెడుతారు. ఇలాంటి బ్లాక్ మెయిల్ రాజకీయాలు, అక్రమ కేసులకు భయపడేది లేదు. అరెస్టులు మాకు కొత్త కాదు. దీనిపై న్యాయవాదుల సలహా మేరకు తదుపరి కార్యాచరణ చేపడుతాం. హైకోర్టు తీర్పు కాపీ పూర్తిగా పరిశీలించాక నిర్ణయం తీసుకుంటాం. ఈ కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తారు" అని హరీశ్ రావు వెల్లడించారు.

# ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అధికారులు పనిచేయాలి: మంత్రి తుమ్మల



హైదరాబాద్: అధికారులు ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు పనిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతిపై సచివాయలంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందనరావు, డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వివిధ అంశాలపై మంత్రి చర్చించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, మంత్రుల నుంచి వచ్చే విజ్ఞప్తులను సత్వరమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పరిష్కారంలో జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సన్న, చిన్న కారు రైతులకు ప్రయోజనాలు అందేలా వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్య పరికరాలకు మరింతగా ప్రోత్సాహం అందించాలన్నారు. ట్రేడర్లు రైతుల వద్దకు వెళ్లి విక్రయించేలా రాష్ట్రంలో 3 ఆధునిక మార్కెట్లు అధునాతన హంగులతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి సూచించారు. సంచార భూసార పరీక్ష కేంద్రాలను ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్సిటీల్లో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాల వృద్ధి, కొత్త భవనాల నిర్మాణాలకు బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రైతు వేదికల నిర్వహణ ఖర్చుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఆ టెండర్లతో గందరగోళం ... కోమటిరెడ్డి షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం ఒక్కో పనికి ఒక్కో టెండర్ పిలిచి అంత గందరగోళం చేస్తే.. అన్నింటిని సరిదిద్దామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆల్వాల్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణాన్ని రూ. 897 కోట్లతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆల్వాల్ టిమ్స్ హాస్పిటల్‌పై రివ్యూ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... 11.53 లక్షల స్క్వేర్ ఫీట్లలో హాస్పిటల్ నిర్మాణం చేసినట్లు తెలిపారు. 90శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ధర్మశాల నిర్మాణం చేపట్టడం ఎందుకు చేపట్టడం లేదని అధికారులను ప్రశ్నించారు. సనత్‌నగర్, ఎల్బీనగర్ టిమ్స్ నిర్మాణాల్లో ధర్మశాల ఉన్నప్పుడు ఇక్కడ ఎందుకు నిర్మించడం లేదని అధికారులను నిలదీశారు. శాఖల మధ్య సమన్వయం లేకనే ఇబ్బందులని అన్నారు. 35 డిపార్ట్‌మెంట్ సేవలు అందుబాటులోకి వస్తాయన్న అధికారులు తెలిపారు. 24 ఆపరేషన్ థియేటర్స్ ఉన్నాయని అధికారులు చెప్పారు. నిర్మాణం 70 శాతం పూర్తయినా ధర్మశాల నిర్మాణం పట్ల ఎందుకు నిర్లక్ష్యం చేశారని సీరియస్ అయ్యారు. వాస్తు పేరిట కేసీఆర్ ప్రభుత్వం మార్పులు చేర్పులు చేయడం వల్ల పనుల్లో ఆలస్యం జరిగిందని మంత్రికి నిర్మాణ సంస్థ తెలిపింది. నిర్మాణంలో శాఖల మధ్య సమన్వయం లేక పనులు ఆలస్యం అవడం బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టిమ్స్ హాస్పిటల్ నిర్మాణాలపై ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. వారు 2025 డిసెంబర్ నాటికి ఎట్టిపరిస్థితుల్లో సనత్‌నగర్, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ హాస్పిటల్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం టిమ్స్ అల్వాల్ పనులు త్వరలో పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. టిమ్స్, ఎల్బీనగర్ పనులు భూమి సమస్య కారణంగా పనుల్లో జాప్యం జరిగిందని అన్నారు. వాస్తవానికి 2021 నిర్మించాలని నిర్ణయించినా.. ఇప్పటి వరకు 27 శాతానికి మించి పనులు కాలేదన్నారు. తాను మంత్రి పదవి చేపట్టాక ముఖ్యమంత్రితో చర్చించి ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ వస్తున్నానని అన్నారు. హాస్పిటల్ భూమికి ఇబ్బందిగా మారిన భూసమస్యను పరిష్కరించానని అన్నారు. మనం నిర్మిస్తుంది హాస్పిటల్.. జాగ్రత్తగా, నాణ్యంగా, వేగంగా పనులు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఆలోచనతో ముందుకు సాగాలని నిర్మాణ సంస్థకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌తో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేస్తానని అన్నారు. ఇప్పటికైనా వేగంగా పనులు చేయాలని సూచించారు. నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్‌లాగా.. పది మంది మెచ్చేలా హాస్పిటల్‌ను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి సూచించారు. మేజర్ ఓటీ, ఎమర్జెన్సీ, రేడియల్ వార్డ్, ఆంకలాజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్, ఇతర మెడికల్ వార్డ్స్ నిర్మాణంలో వైద్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు.

# రాసి పెట్టుకోండి.. ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటాం: కేటీఆర్



హైదరాబాద్: ఫార్ములా ఈ–రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ పిటిషన్‌పై మంగళవారం ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఉపసంహరించింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో కేటీఆర్‌కు ఈడీ మరోసారి నోటీసులు ఇచ్చింది. జనవరి 16న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. తాజా పరిణామాల నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. "నా మాటలు రాసి పెట్టుకోండి. ఈ ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటాం. ఈ అబద్ధాలు నన్ను దెబ్బ తీయలేవు. ఆ ఆరోపణలు నన్ను తగ్గించలేవు. కుట్రలతో నా నోరు మూయించలేరు. నేటి అడ్డంకులే రేపటి విజయానికి దారి తీస్తాయి. నేను న్యాయవ్యవస్థను గౌరవిస్తాను. న్యాయం గెలుస్తుందనేది నా అచెంచల విశ్వాసం. సత్యం కోసం నా పోరాటం కొనసాగుతుంది. నా పోరాటానికి ఈ ప్రపంచమే సాక్షిగా నిలుస్తుంది" అని అన్నారు.




# కేటీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురు.. క్వాష్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఫార్ములా ఈ–రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 31న ఇరువైపుల వాదనలు ముగించిన హైకోర్టు.. నేడు తీర్పు వెలువరించింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఉపసంహరించింది. ఏసీబీ అరెస్ట్ చేయకుండా 10 రోజుల పాటు మధ్యంతర ఉత్తర్వులు పొడిగించాలన్న కేటీఆర్ విజ్ఞప్తిని తిరస్కరించింది. ఉన్నత న్యాయస్థానం తీర్పుపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చిస్తున్నారు. దీనిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు సమాచారం. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానంలో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ–రేసు కేసులో కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని ముందస్తుగానే పిటిషన్ వేసింది.

**గతంలో వాదనలు కొనసాగాయిలా..** ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఫార్ములా – ఈ రేసు వ్యవహారంలో ఒప్పందం జరగకముందే చెల్లింపులు చేశారని ఆయన కోర్టుకు తెలిపారు. బ్రిటన్ పౌండ్ల రూపంలో రూ.46 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఈ – కార్ల రేసింగ్ సీజన్ 10 ఒప్పందానికి ముందే నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేశారన్నారు. దర్యాప్తు ఏ దశలో ఉందని ఈ సందర్భంగా ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ ప్రాథమిక దశలోనే ఉందని.. అన్ని ఆధారాలు బయటపడతాయని ఏజీ తెలిపారు. ఇప్పటికే ఫిర్యాదుదారు దానకిశోర్ వాంగ్మూలం సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. నిందితులు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా అని న్యాయస్థానం ప్రశ్నించారు. ఇప్పటివరకు నిందితులు ఎలాంటి పిటిషన్లు దాఖలు చేయలేదని, ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని ఏజీ తెలిపారు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ధర్మాసనానికి ఏజీ తెలిపారు. దానకిశోర్ తరఫున సీనియర్ న్యాయవాది సీపీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పురపాలక శాఖ మంత్రి పర్యవేక్షణలోనే ఆ శాఖ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. రేసింగ్‌కు సంబంధించిన చెల్లింపుల దస్త్రాన్ని అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆమోదించారని కోర్టుకు తెలిపారు. రేసింగ్ వ్యవహారంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఏసీబీ అధికారులు నమోదు చేసిన సెక్షన్లు కేటీఆర్‌కు వర్తించవని కోర్టుకు తెలిపారు. నగదు బదిలీలో కేటీఆర్ ఎక్కడా లబ్ధిపొందలేదని, అవినీతి జరిగినట్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా పేర్కొనలేదని తెలిపారు. ఫార్ముాలా–ఈ కార్ల రేసు నిర్వహణపై జరిగిన ఒప్పందంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఫార్ములా –ఈ ఆపరేషన్స్ సంస్థ సంతకాలు చేశాయని ఆయన వాదించారు. పురపాలక శాఖకు మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన కేటీఆర్‌ను ఎఫ్ఐఆర్‌లో నిందితుడిగా చేర్చడం తగదన్నారు. ఈ మేరకు పలు హైకోర్టు తీర్పులను సిద్ధార్థ్ దవే ప్రస్తావిస్తూ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరారు.



# శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అర్జున్

హైదరాబాద్: సినీ నటుడు అల్లు అర్జున్ సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను ఆయన పరామర్శించారు.

తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజుతో కలిసి లోపలికి వెళ్లారు. సుమారు 20 నిమిషాల పాటు ఆస్పత్రిలో ఉన్న అల్లు అర్జున్.. వైద్యులతో మాట్లాడి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుడి తండ్రి భాస్కర్‌తోనూ మాట్లాడారు. మరోవైపు ఆస్పత్రి వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు నమోదైన నేపథ్యంలో పరామర్శకు వెళ్లొద్దని లీగల్ టీమ్ చెప్పడంతో శ్రీతేజ్ వద్దకు రాలేదని ఇటీవల అల్లు అర్జున్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తెలిపారు. తాజాగా పోలీసులకు సమాచారం ఇచ్చిన తర్వాత కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి శ్రీతేజ్‌ను పరామర్శించారు. గత నెల 4న 'పుష్ప2' బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఆ బాలుడిని కిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే రేవతి కుటుంబానికి అల్లు అర్జున్‌తో పాటు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, దర్శకుడు సుకుమార్ ఆర్థికసాయం ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.కోటి, పుష్ప2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ.50లక్షల చెక్కులను ఇటీవల దిల్ రాజు ద్వారా ఆ కుటుంబానికి అందజేశారు.



# 'గరికపాటిపై దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు'

హైదరాబాద్: ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావుపై జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఆయన టీమ్ స్పందించింది. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న దుష్ప్రచారం ఆయన కుటుంబ సభ్యులతో పాటు అభిమానులను కలత పెడుతోందని తెలిపింది. ఈ మేరకు గరికపాటి సోషల్ మీడియా ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు.

"ఇటీవల కొందరు వ్యక్తులు, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు తప్పుడు ప్రచారంతో పరువు తీస్తున్నారు. గరికపాటిపై వారు చేసిన ఆరోపణలన్నీ నిరాధారం.. సత్యదూరం. వేర్వేరు ఘటనల్లో ఎవరెవరికో చెప్పని క్షమాపణలు చెప్పినట్లుగా పేర్కొంటూ ఆయన గౌరవానికి భంగం కలిగించేలా ప్రచారం చేస్తున్నారు.

అంతటితో ఆగకుండా పారితోషికాలు, ఆస్తుల విషయంలో కూడా అసత్య ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయంలో తప్పుడు ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానళ్లు, సంస్థలపై క్రిమినల్, పరువు నష్టం కేసులు వేస్తాం.

ఇకపై అలాంటి దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు.

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి కేటీఆర్ కృషి చేశారు: జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రం కోసమే కేటీఆర్ తాపత్రయపడ్డారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరాల్లో ఒకటిగా నిలబెట్టడానికి, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి ఎంతో కృషి చేశారన్నారు. పార్టీ నేతలతో కలిసి హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో మొదటి వరుసలో హైదరాబాద్‌ను నిలబెట్టేందుకు కేటీఆర్ చేసిన కృషి ఇప్పటికీ నగరవాసుల హృదయాల్లో ఉంది. కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే భారాస మరింత బలపడుతుంది. రేవంత్‌రెడ్డి చేయించే అబద్ధపు ప్రచారాలు నిలబడవు" అని జగదీశ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "కేటీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరు. నిజం నిలకడమీద తెలుస్తుంది. న్యాయస్థానం, చట్టాలపై మాకు నమ్మకం ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలు ఛేదించుకుని కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు. అక్రమ కేసులతో భారాస నేతలను బెదిరించాలని చూస్తే భయపడం. మా ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు భారాస కార్యకర్తలంతా మీ వెంటపడతారు" అని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com